


PRAJA PRASHNA

# ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267

తెలుగు దినపత్రిక




సంపుటి: 5 సంచిక: 256, పేజీలు - 08

సోమవారం, మార్చి 2, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

## గత రికార్డులన్నీ బ్రేక్

**- టీజీఎన్‌పీడీసీఎల్ అత్యధిక గరిష్ట విద్యుత్ డిమాండ్ నమోదు**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)**తెలంగాణలో ఎండలు మండిపోతున్నాయి. ఈసారి ఫిబ్రవరి రెండో వారం నుంచే భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఉదయం 8 తర్వాత నుంచే ఎండలు భగ భగ మండుతున్నాయి. మధ్యాహ్నం సమయానికి కాలు బయట పెట్టలేని పరిస్థితి. ఇక రాత్రి సమయాల్లో తీవ్రమైన ఉక్కపోతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలను ఆశ్రయిస్తున్నారు. ఫలితంగా రాష్ట్రంలో విద్యుత్ వినియోగం విపరీతంగా పెరిగింది. విద్యుత్ వినియోగంలో సరికొత్త రికార్డులు నమోదవుతున్నాయి. టీజీఎన్?పీడీసీఎల్ చరిత్రలోనే గతంలో ఎన్నడూ లేని విధంగా ఫిబ్రవరి చివరి వారంలో శనివారం గరిష్ట

2లో..

## గల్ఫ్ దేశాల్లో తెలుగువారు

# అప్రమత్తంగా ఉండాలి



**- తెలుగువారికి సీఎం రేవంత్ రెడ్డి సూచన**

- ఎంబసీల మార్గదర్శకాలను ఎప్పటికప్పుడు పాటించాలని పిలుపు
- బహ్రెయిన్‌లోని తెలుగువారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్న ఏపీ స్పీకర్ అయ్యన్న
- అవసరమైతే కేంద్రంతో మాట్లాడి క్షేమంగా రప్పిస్తామని హామీ

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** పశ్చిమాసియా దేశాల్లో నెలకొన్ని ఉద్రిక్త పరిస్థితుల్లో ఇరాన్, ఇజ్రాయెల్ ప్రాంతాల్లో ఉన్న తెలుగు ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. భద్రతా మార్గదర్శకాలను పాటించాలని అక్కడి తెలుగు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఈ ముఖ్యమంత్రి కార్యాలయం సోషల్ మీడియా ఎక్స్ వేదికగా ట్వీట్ చేసింది.

**ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఉండాలి**


ఆయా దేశాల్లోని భారత రాయబార కార్యాలయాలు జారీ చేసే సూచనలు పాటించాలని రేవంత్ రెడ్డి కోరారు అత్యవసర పరిస్థితి ఎదురైతే తప్ప తెలుగు ప్రజలు ఎవరూ బయటకు రావొద్దని సూచించారు. తెలుగువారిని రప్పించేందుకు కేంద్రంతో రాష్ట్రం సమన్వయం చేసుకుంటుందన్న ఆయన ఇరాన్, గల్ఫ్ దేశాల్లోని రాష్ట్రప్రజల పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం పరిశీలిస్తుందని పేర్కొన్నారు. అవసరమైతే కేంద్రంతో సమన్వయం చేసుకుని చర్యలు తీసుకుంటామన్నారు. భారత ఎంబసీలు, కాన్సులేట్‌తోనూ సంప్రదింపులు జరపాలని కోరారు. రాష్ట్రప్రజల భద్రతే రాష్ట్ర ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని, ప్రతి ఒక్కరూ సురక్షితంగా ఉండాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఇరాన్, ఇజ్రాయెల్ ప్రాంతాల్లో ఉంటున్న భారతీయుల

2లో..

## హార్మూజ్ జలసంధిని

# మూసేసిన ఇరాన్

**- భారత్ సహా ప్రపంచ దేశాలపై ప్రభావమెంత.?**




**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా చేస్తున్న దాడులు తీవ్రతరం అయ్యాయి. అదే సమయంలో ప్రతీకార దాడులకు దిగిన ఇరాన్ పలు ముస్లిం దేశాలపైనా విరుచుకుపడుతుండటంతో మిడిల్ ఈస్ట్‌లో పరిస్థితులు దారుణంగా తయారయ్యాయి. ఇరాన్, యూఏఈ దాడుల నేపథ్యంలో హార్మూజ్ జలసంధిని ఇరాన్ దళాలు మూసివేశాయి. అయితే ఈ హార్మూజ్ జలసంధిని మూసివేయడంతో దాని ప్రభావం భారత్‌పై పడే అవకాశాలు ఉన్నాయని నిపుణులు పేర్కొంటున్నారు. ప్రపంచ చమురు రవాణాలో ఎక్కువ శాతం ఈ హార్మూజ్ జలసంధి నుంచే జరుగుతుండగా ఇప్పుడు దాన్ని మూసివేయడం ప్రపంచ దేశాలను ఉక్కిరి బిక్కిరి చేస్తోంది.

ప్రపంచంలోనే ప్రధాన

2లో..

## రెండు సంవత్సరాలు మీ ఇండ్లను,

# భూములను కాపాడుకోండి

**- రాష్ట్రంలో కాంగ్రెస్ బుల్డోజర్ రాజ్యం నడుస్తోందన్న కేటీఆర్**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ బుల్డోజర్ రాజ్యం నడుస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఒకవైపు దేశంలో బీజేపీ బుల్డోజర్ రాజ్యం చేస్తుందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ సహా ఇతర నేతలు చెబుతుందని మరి తెలంగాణలో జరుగుతున్న బుల్డోజర్ రాజ్యాన్ని కాంగ్రెస్ ఎందుకు ఆపడం లేదని ప్రశ్నించారు. సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న బుల్డోజర్ అరాచకాలను కేవలం సీఎం రేవంత్ రెడ్డి పంపిస్తున్న సంచుల కట్టల కోసం చూడకుండా వదిలేస్తున్నారన్నారని ఆరోపించారు. రేవంత్ రెడ్డికి తెలిసిన పాలన కేవలం ఇండ్లను కూలగొట్టడం, భూములు ఆక్రమించడం, రియల్ ఎస్టేట్ దందా చేయడం, దానికోసం పేదల జీవితాలను పూర్తిగా నాశనం చేయడమే అని కేటీఆర్ సంచలన ఆరోపణలు చేశారు.

2లో..

## దేశానికే ఆదర్శంగా

# అమరావతి జస్టిస్ సిటీ

- విజయవాడలో మధ్యవర్తిత్వంపై రాష్ట్రస్థాయి సదస్సు
- ముఖ్య అతిథిగా హాజరైన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్
- జస్టిస్ సిటీలో అంతర్జాతీయ స్థాయి వసతులు కల్పిస్తామన్న సీఎం



**అమరావతి (ప్రశ్న న్యూస్)** అమరావతిలో నిర్మిస్తున్న జస్టిస్ సిటీని దేశంలోనే అత్యుత్తమ మోడల్ గా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. విజయవాడ వేదికగా ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సెల్ అథార్టీ ఆధ్వర్యంలో 'మధ్యవర్తిత్వం'పై జరిగిన రాష్ట్రస్థాయి సదస్సులో ఆయన పాల్గొన్నారు. భారత ప్రధాన న్యాయమూర్తి

2లో..

# ఏపీ జ్యుడీషియల్ అకాడమీకి శంకుస్థాపన

**- రూ.165 కోట్లతో నిర్మాణం**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి వేదికగా న్యాయ వ్యవస్థలో మరో కీలక అడుగు పడింది. పిచ్చుకలపాలెం వద్ద అత్యాధునిక ఏపీ జ్యుడీషియల్ అకాడమీ నిర్మాణానికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో పాటు పలువురు సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు పాల్గొని ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. సుమారు 165 కోట్ల రూపాయల భారీ వ్యయంతో అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఈ అకాడమీని నిర్మిస్తున్నారు. మొత్తం 2.05 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో రూపుదిద్దుకోనున్న ఈ భవన సముదాయం, న్యాయాధికారులకు అత్యున్నత స్థాయి శిక్షణ అందించే కేంద్రంగా నిలవనుంది. ఒకేసారి 120 మంది ట్రైనీ జడ్జిలకు శిక్షణ ఇచ్చేలా ఈ అకాడమీని శాస్త్రీయంగా రూపొందించారు.

2లో..

## ప్రతీ సోమవారం ధర్మవాణి కార్యక్రమం

**- ఏ సమస్య అయినా వారం రోజుల్లో పరిష్కారం**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ కీలక సంస్కరణలకు తెరతీసింది. తమ శాఖ పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు ధర్మవాణి అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తెలంగాణ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ డైరెక్టర్ హనుమంతరావు ఈ ధర్మవాణి కార్యక్రమాన్ని ప్రవేశపెట్టారు. ఇక నుంచి ప్రతి సోమవారం నిర్వహించే ఈ ధర్మవాణి కార్యక్రమం ద్వారా ఆ శాఖలోని ఉద్యోగులు, అర్చకులు, సిబ్బంది దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా డైరెక్టర్ హనుమంతరావు విననున్నారు. ఆ తర్వాత వాటిని సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టనున్నారు. ఎండోమెంట్ కమిషనర్, డైరెక్టర్ హనుమంతరావు ఆదేశాల మేరకు ప్రతి సోమవారం రోజున ఉదయం 10 గంటల నుంచి హైదరాబాద్‌లోని డైరెక్టర్ కార్యాలయంలో ఉద్యోగులు, సిబ్బంది

2లో..

# టెంపుల్ టూరిజం ప్రాంతంగా ములుగు

**- అన్ని రకాలుగా అభివృద్ధి చేస్తామన్న పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ములుగు జిల్లాను టెంపుల్ టూరిజం ప్రాంతంగా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో తమ ప్రభుత్వం పని చేస్తోందని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. నేడు పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యేలు వెంకట్రావు, పాయం వెంకటేశ్వర్లతో కలిసి జిల్లాలోని మల్లూరు హేమాచల లక్ష్మీ నరసింహ స్వామి దర్శించుకున్నారు. అనంతరం మాట్లాడిన ఆయన హేమాచల లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయాన్ని సైతం అభివృద్ధి చేస్తామని అన్నారు. 'మల్లూరు గుట్టలో స్వయంభుగా వెలసిన హేమాచల లక్ష్మీ నరసింహ స్వామిని దర్శించుకోవడం సంతోషంగా ఉంది. తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి

2లో..

## మోదీ అధ్యక్షతన అత్యవసర సమావేశం

**- పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలపై చర్చ**




**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** పాకిస్తాన్ నుంచి భారత్ సరిహద్దులో ఉద్భవిస్తున్న తీవ్ర ఉద్రిక్తతలపై ప్రధాని నరేంద్ర మోదీ అత్యవసరంగా ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. తాజా ఘటనల నేపథ్యంగా దేశ రక్షణ పరిస్థితిని అంచనా వేసేందుకు రక్షణ మంత్రిత్వ శాఖ, విదేశాంగ మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులతో

2లో..

## ఇరాన్ తాత్కాలిక సుప్రీం లీడర్‌గా

# అయతొల్లా అరాఫీ

- అమెరికా ఇజ్రాయెల్ వైమానిక దాడిలో ఖమేనీ మృతి
- పరిపాలన కోసం ముగ్గురు సభ్యులతో ప్రత్యేక కౌన్సిల్ ఏర్పాటు
- గార్డియన్ కౌన్సిల్ సభ్యుడిగా అరాఫీకి ఉన్నత అనుభవం



**టెహ్రాన్ (ప్రశ్న న్యూస్)** ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణంతో ఆ దేశం కీలక నిర్ణయం తీసుకుంది. ఆయన వారసుడిగా అయతొల్లా అలిరెజా అరాఫీని ఇరాన్ తాత్కాలిక సుప్రీం లీడర్‌గా ఆదివారం నియమించింది. టెహ్రాన్‌లోని నివాసంపై అమెరికా–ఇజ్రాయెల్ జరిపిన వైమానిక దాడిలో ఖమేనీ మరణించినట్లు ఇరాన్ అధికారికంగా ప్రకటించింది. ఇస్లామిక్ విప్లవ నేత ఖొమేనీ మరణం తర్వాత, 1989 నుంచి ఖమేనీ ఇరాన్ అత్యున్నత నాయకుడిగా కొనసాగుతూ వచ్చారు. ఖమేనీ మరణం తర్వాత దేశ పాలనా వ్యవహారాలను పర్యవేక్షించేందుకు ముగ్గురు సభ్యులతో కూడిన కౌన్సిల్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్, జ్యుడీషియరీ చీఫ్ గులాంహొస్సేన్ మొహసెని ఎజెయి, గార్డియన్ కౌన్సిల్ జ్యూరిస్ట్ ఉంటారని 'ఐఆర్ఎన్ఏ' (ఐఆర్ఎన్ఏ) వార్తా సంస్థ తెలిపింది. ఇరాన్ రాజ్యాంగం ప్రకారం, 88 మంది సభ్యులున్న

2లో..

## ఫిబ్రవరి నెల జీఎస్టీ వసూళ్లలో మహారాష్ట్ర టాప్

**- రూ.1.83 లక్షల కోట్లకు చేరిన స్థూల జీఎస్టీ వసూళ్లు**




**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** దేశంలో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు ఫిబ్రవరి నెలలో భారీగా నమోదయ్యాయి. 2026 ఫిబ్రవరి నెలకు గాను రూ.1.83 లక్షల కోట్ల స్థూల జీఎస్టీ వసూలైనట్లు కేంద్రం ఆదివారం విడుదల చేసిన అధికారిక గణాంకాలు వెల్లడించాయి. అంతకుముందు నెలతో పోలిస్తే ఇది 8.1 శాతం అధికం కావడం

2లో..

## ఒక్క దెబ్బకు 48 మందిని లేపేశాం

**- ఇది అద్భుత విజయమన్న ట్రంప్**



**న్యూయార్క్ (ప్రశ్న న్యూస్)** "ఒక్క దెబ్బకు 48 మంది ఇరాన్ అగ్రనేతలను లేపేశాం.. ఇది మాకు అద్భుత విజయం" అంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా ప్రకటన చేశారు. మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. మార్చి 1 నాటికి పరిస్థితి చేజారిపోయి, పూర్తిస్థాయి యుద్ధ వాతావరణం నెలకొంది. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా చేపట్టిన 'ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ' ఇరాన్ గుండెల్లో గుబులు రేపింది. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణించడం ఇరాన్ చరిత్రలోనే అతిపెద్ద విషాదంగా మారింది. టెహ్రాన్ నడిబొడ్డున అమెరికా, ఇజ్రాయెల్ దళాలు విరుచుకుపడ్డాయి. దాదాపు 1,200కు పైగా బాంబులు, ఆయుధ సామగ్రితో ఇరాన్‌పై దాడి చేశాయి. ఈ విధ్వంసంలో ఇరాన్ అగ్రనాయకత్వం కుప్పకూలింది. ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఈ దాడి తీవ్రతను కళ్లకు కడుతున్నాయి. ఇరాన్ ఒకవేళ ప్రతీకారానికి దిగితే, ఇంతకంటే భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ట్రంప్ తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు.

2లో..

# గత రికార్డులన్నీ బ్రేక్

విద్యుత్ డిమాండ్ 6,057 మెగావాట్లు నమోదు అయింది. తాజాగా ఆ రికార్డు సైతం చెరిగిపోయింది. ఆదివారం చరిత్రలోనే అత్యధిక గరిష్ఠ విద్యుత్ డిమాండ్ 6,267 మెగావాట్లు నమోదైనట్లు టీజీఎన్?పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి వెల్లడించారు. శనివారం నమోదైన హై పీక్ డిమాండ్ కొన్ని గంటల వ్యవధిలోనే అధిగమించిపోయిందని చెప్పారు. టీజీఎన్?పీడీసీఎల్ చరిత్రలో ఇది ఒక మైలురాయిగా నిలిచిందని ఆయన స్పష్టం చేశారు. రోజురోజుకు ఎండలు మండిపోతుండటంతో విద్యుత్ డిమాండ్ విపరీతంగా పెరుగుతోందని వెల్లడించారు. అయినా సరే ప్రజలకు ఎలాంటి అంతరాయం లేకుండా నిరంతర విద్యుత్ సరఫరా అందించేందుకు తాము ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.డిమాండ్ ఎంత పెరిగినా విద్యుత్ సరఫరాలో అంతరాయం రాకుండా విద్యుత్ అందించేందుకు సంస్థ పూర్తిగా సమాయత్తమై ఉందని చెప్పారు. సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, ఉన్నతాధికారుల పర్యవేక్షణ, దిశానిర్దేశంతో తెలంగాణ విద్యుత్ వినియోగదారులకు నిరంతర విద్యుత్ సరఫరా అందించడమే తమ లక్ష్యమని అన్నారు. రానున్న రోజుల్లో డిమాండ్ మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని చెప్పారు. అందుకు సంస్థ పూర్తిగా సిద్ధంగా ఉందని ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అప్రమత్తంగా చర్యలు తీసుకుంటున్నామని సీఎండీ వివరించారు. కాగా, ఈ ఏడాది వడగాలుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని ఇప్పటికే ఐఎండీ స్పష్టం చేసింది. మార్చి చివరి వారం నుంచి మే వరకు వడగాలుల ప్రభావం ఎక్కువగా ఉంటుందని చెప్పారు. ముఖ్యంగా హైదరాబాద్, మహబూబ్‌నగర్, నల్గొండ జిల్లాల్లో దీని ప్రభావం ఎక్కువగా ఉంటుందని ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

# గల్ఫ్ దేశాల్లో తెలుగువారు అప్రమత్తంగా ఉండాలి

రక్షణ, భద్రత కోసం తీసుకుంటున్న చర్యలను, పరిస్థితులను ఎప్పటికప్పుడు దౌత్యకార్యాలయాల ద్వారా ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ స్వదేశానికి తరలించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి ఎక్స్వేదికగా కేంద్ర విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి జైశంకర్ను విజ్ఞప్తి చేశారు.

### బాధిత కుటుంబాల్లో ఆందోళన

ఉపాధి, ఉద్యోగ అవకాశాల కోసం రాష్ట్రానికి చెందిన లక్షల మంది గల్ఫ్ దేశాల్లో పలు రకాల పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. కొంతమంది కారు డ్రైవర్లుగా, మరికొందరు భవన నిర్మాణ కార్మికులుగా, ఇంకొంతమంది తోటపనులు చేసుకుంటూ జీవనభృతిని పొందుతున్నారు. గల్ఫ్ దేశాల్లో యుద్ధ వాతావరణం నెలకొనడంతో అక్కడ ఉపాధికోసం వెళ్లిన బాధిత కుటుంబ సభ్యుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. తమ వారు దేశం కాని దేశంలో ఎలా ఉన్నారో అని టెన్షన్ పడుతూ పదే పదే వారికి కాల్స్ను చేస్తున్నారు. వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటున్నారు. అందరూ క్షేమంగా ఉన్నామని చెబుతుండటంతో వారు ఊపిరి పీల్చుకుంటున్నారు.

### ప్రజలకు ఇబ్బందులు లేకుండా కేంద్రం చూడాలి

మరోవైపు పశ్చిమాసియా దేశాల్లో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పలు వ్యాఖ్యలు చేశారు. యుద్ధం దృష్ట్యా రాష్ట్ర ప్రజలకు ఇబ్బందులు లేకుండా కేంద్రం చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గల్ఫ్ దేశాల్లో చాలామంది తెలంగాణ పౌరులు ఉన్నారని వివరించారు. ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా దాడుల నేపథ్యంలో ప్రజలు క్షేమంగా ఉండాలని కోరారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తెలంగాణ ఎన్నారై అడ్వైజరీ కమిటీ ప్రభుత్వం దృష్టికి తేవాలని పొన్నం ప్రభాకర్ కోరారు. కేంద్ర, రాష్ట్ర సహకారంతో రాష్ట్రప్రజలను స్వదేశానికి రప్పించేలా చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

# హార్మూజ్ జలసంధిని మూసేసిన ఇరాన్

ఆయిల్ ఉత్పత్తి దేశాలైన ఇరాక్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లను గల్ఫ్ ఆఫ్ ఒమన్, అరేబియా సముద్రంతో ఈ హర్మూజ్ జలసంధి కలుపుతుంది. ఈ హర్మూజ్ జలసంధి గుండా నిత్యం లక్షల బ్యారెళ్ల ముడి చమురు ఆయా దేశాలకు ఎగుమతి అవుతూ ఉంటుంది. ఇలాంటి వ్యూహాత్మక, కీలక మార్గాన్ని ఇరాన్ ఆర్మీ మూసివేయడంతో అంతర్జాతీయ మార్కెట్లో పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడుతుందనే భయాలు వెల్లువెత్తుతున్నాయి. దాని వల్ల చమురు ధరలు ఆకాశాన్నంటే పరిస్థితి ఉంటుందని నిపుణులు హెచ్చరికలు చేస్తున్నారు.ఇదే జరిగితే భారత్‌పై కూడా దీని ప్రభావం ఉంటుందని చెబుతున్నారు. అమెరికాకు మద్దతుగా ఉన్న దేశాలపైనా ఇరాన్ సైన్యం దాడులు చేస్తున్న నేపథ్యంలో హార్మూజ్ జలసంధి గుండా వెళ్లేందుకు ప్రయత్నించిన ఓ భారీ ఆయిల్ ట్యాంకర్ నౌకపై ఇరాన్ దళాలు దాడులు చేయడం మరింత ఉద్రిక్తతలకు దారి తీసింది. హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించే ఆయిల్ ట్యాంకర్లను ఇరాన్ ధ్వంసం చేస్తే ఆ ప్రభావం భారత్‌పైనా ఉంటుందని నిపుణులు పేర్కొంటున్నారు. చమురు కొరత సంభవించే ప్రమాదం ఉందని.. ధరలు కూడా భారీగా పెరిగే అవకాశాలు ఉన్నాయని అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. భారత్, ఇరాన్ మధ్య మంచి సంబంధాలు ఉన్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ముందుగానే అలర్ట్ కావాలని నిపుణులు హితవు పలుకుతున్నారు. చమురు కొరత లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

### అసలేంటీ హర్మూజ్ జలసంధి?

పర్షియన్ గల్ఫ్ ప్రాంతాన్ని, అరేబియా సముద్రాన్ని కలిపే ఇరుకైన సముద్ర మార్గాన్నే హర్మూజ్ జలసంధి అని పిలుస్తారు. కేవలం 33 కిలోమీటర్ల (21 మైళ్ల) వెడల్పు ఉండే ఈ సన్నటి మార్గం గుండా ప్రపంచ దేశాలకు ప్రతి రోజు చమురు సరఫరా అవుతుంది. అంతర్జాతీయంగా అన్ని దేశాలు రోజూ ఉపయోగించే చమురులో దాదాపు 20 శాతం చమురు ఈ హర్మూజ్ జలసంధి గుండానే తరలిస్తారు. ఖతార్, యూఏఈ, సౌదీ అరేబియా, కువైట్, బహ్రైన్, ఇరాన్ వంటి దేశాలు తమ చమురు ఎగుమతులను ఈ హర్మూజ్ జలసంధి ద్వారానే ఇతర దేశాలకు తరలిస్తాయి. హర్మూజ్ జలసంధికి సమీపంలోని చాలా ద్వీపాలు ప్రస్తుతం ఇరాన్ అధీనంలోనే ఉండగా.. ఆ ప్రాంతంలో ఇరాన్ సైనిక శక్తి కూడా చాలా బలంగా ఉంటుంది. ఇప్పుడు ఈ హర్మూజ్ జలసంధిని మూసివేయడంతో అంతర్జాతీయ చమురు మార్కెట్‌లో క్రూడాయిల్ ధరలు భారీగా పెరుగుతాయనే భయాలు వెల్లువెత్తుతున్నాయి.ఆయిల్ దిగుమతులపై అధికంగా ఆధారపడిన భారత్, చైనా వంటి దేశాలకు హర్మూజ్ జలసంధి మూసివేయడం గుబులు పెట్టిస్తోంది. ఈ హర్మూజ్ జలసంధి ద్వారా తరలించే చమురు ఎగుమతుల్లో 82 శాతం ఆసియా దేశాలే దిగుమతి చేసుకుంటుండటం గమనార్హం. భారత్, చైనా, దక్షిణ కొరియా, జపాన్‌లే 67 శాతం వినియోగించుకుంటున్నాయి. మన దేశం వినియోగించే ముడి చమురులో 90 శాతం మధ్య ప్రాచ్యంలో ఉన్న దేశాల నుంచే దిగుమతి చేసుకుంటున్నాం. ఇందులో దాదాపు సగం హర్మూజ్ జలసంధి మార్గం గుండానే వస్తోంది. దీంతో ఈ హర్మూజ్ జలసంధి భారత్‌కు ఎంత ముఖ్యమో అర్థం అవుతోంది.

# దేశానికే ఆదర్శంగా అమరావతి జస్టిస్ సిటీ

(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ ముఖ్య అతిథిగా హాజరైన ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబు ప్రసంగిస్తూ.. రాష్ట్రంలో న్యాయ వ్యవస్థ బలోపేతానికి, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉద్ఘాటించారు. రాజధాని నిర్మాణంలో భాగంగా జస్టిస్ సిటీలో న్యాయ వ్యవస్థకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నామని చంద్రబాబు వివరించారు. ముఖ్యంగా జుడిషియల్ అకాడమీ, లీగల్ సర్వీసెస్ అథార్టీ, మీడియేషన్ సెంటర్, ఇంటర్నేషనల్ లా యూనివర్శిటీ, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వంటి కీలక విభాగాలన్నింటినీ ఒకే చోట ఇంటిగ్రేట్ చేస్తూ.. బెస్ట్ జుడిషయల్ సిటీని నిర్మిస్తామని తెలిపారు. ఈ బృహత్తర కార్యానికి సీజేఐ సహకారం కావాలని ఆయన కోరారు. అమరావతిలో 'నేషనల్ జుడిషియల్ అకాడమీ' ఏర్పాటు చేయాలని, ఇందుకు అవసరమైన భూములు ఇవ్వడానికి, పూర్తి సహకారం అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీజేఐకి విజ్ఞప్తి చేశారు.

గ్రామీణ ప్రాంతాల్లో మధ్యవర్తిత్వం ద్వారా సమస్యలను పరిష్కరించుకునే సంప్రదాయాన్ని ఈ సందర్భంగా సీఎం గుర్తుచేసుకున్నారు. తన తండ్రి కూడా గ్రామంలో పెద్దరికం వహించి, మధ్యవర్తిత్వం ద్వారా ఎన్నో సమస్యలను పరిష్కరించారని తెలిపారు. కోర్టుల్లో కేసుల భారాన్ని తగ్గించేందుకు మధ్యవర్తిత్వాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ఇందులో భాగంగా మధ్యవర్తిత్వంతో కేసులను పరిష్కరిస్తే రూ. 10 వేలు, ఒకవేళ కేసులు పరిష్కారం కాకపోయినా రూ. 3 వేలు ప్రోత్సాహకంగా ఇస్తామని ప్రకటించారు. సత్వర న్యాయం అందడం వల్ల అభివృద్ధి కూడా వేగవంతం అవుతుందని అభిప్రాయపడ్డారు. ప్రపంచస్థాయి ప్రమాణాలతో, ప్రజల అవసరాలకు అనుగుణంగా అమరావతిని తీర్చిదిద్దుతున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. ల్యాండ్ పూలింగ్ విధానంలో 29,000 మందికి పైగా రైతులు స్వచ్ఛందంగా భూములిచ్చారని, వారి త్యాగంతోనే ఈ నిర్మాణం సాధ్యమవుతోందన్నారు. పర్యావరణ హితంగా, ఆర్థికంగా బలమైన రాజధానిగా ఉండాలనే లక్ష్యంతో.. దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన బ్లూ-గ్రీన్ ఫీల్డ్ రాజధానిగా అమరావతిని అభివృద్ధి చేస్తున్నట్లు వెల్లడించారు. వికసిత్ భారత్-2047 లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. అంతకుముందు సదస్సుకు విచ్చేసిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ కు సీఎం చంద్రబాబు, ఏపీ హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, పలువురు సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

## రెండు సంవత్సరాలు మీ ఇండ్లను,
# భూములను కాపాడుకోండి

మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్ బాధిత కుటుంబాలతో మూసీ దండి మార్చ్ కార్యక్రమంలో భాగంగా మూడున్నర కిలోమీటర్ల పాదయాత్రలో కేటీఆర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సర్కార్‌పై కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. సీఎం రేవంత్ రెడ్డి అధికారం చేపట్టిన తర్వాత ఒక్క ప్రాజెక్టు గానీ, ఒక్క ఇల్లు గానీ, ఒక్క రోడ్డు గానీ వేయకుండా కేవలం విధ్వంసమే తన విధానంగా పెట్టుకుని ముందుకు పోతున్నారని కేటీఆర్ ఆరోపించారు.ఒక్క రెండు సంవత్సరాల పాటు మూసీ బాధితులు తమ భూములను, అపార్ట్‌మెంట్లను కాపాడుకునేందుకు ప్రయత్నం చేయాలని వారికి బీఆర్ఎస్ మద్దతు ఉంటుందని తెలిపారు. తిరిగి రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మూసీ కోసం ఎవరి భూములు, ఇళ్లు పోకుండా చూస్తామని కేటీఆర్ భరోసా ఇచ్చారు. అపార్ట్‌మెంట్ వాసులు, కుటుంబ సభ్యులు ప్రతి ఒక్కరూ ఎన్ని రకాలుగా ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసినా వినిపించుకోకుండా కర్కశంగా ఇళ్లను ఖాళీ చేయిస్తూ, బెదిరింపులకు దిగుతూ కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విధ్వంసానికి పాల్పడుతున్నారని కేటీఆర్ ఆగ్రహం ఆరోపించారు."ముఖ్యమంత్రి ఇప్పటికే అద్భుతమైన ప్రగతి భవన్ సిద్ధంగా ఉన్నా దాన్ని కాదని చెప్పి 200 కోట్ల రూపాయలతో తనకంటూ ఒక నివాసం నిర్మించుకుంటున్నారని, ఇప్పటికే ఆయనకు ప్యాలెస్ లాంటి ఇల్లు ఉన్నదని, అయినా రేవంత్ రెడ్డికి, రేవంత్ రెడ్డి అన్నదమ్ములకు మాత్రం వందల కోట్ల ఇళ్లు కావాలి కానీ పేదలు, మధ్యతరగతి వారికి ఒక అపార్ట్‌మెంట్ ఉండకుండా ఎందుకు ఈ విధ్వంసం" అని కేటీఆర్ ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి వచ్చినప్పటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ఇళ్లను కూలగొట్టడమే పనిగా పెట్టుకున్నారన్నారని కేటీఆర్ ఆరోపించారు. హైడ్రా పేరుతో హైదరాబాద్‌లో వందల మంది ఇళ్లు కూలగొట్టిన రేవంత్ రెడ్డి అటు రామగుండం, మహబూబ్ నగర్, ఖమ్మం వంటి ప్రాంతాల్లో ప్రతి ఒక్కరికీ ఇబ్బంది కలిగేలా ఇళ్లు కూలగొడుతున్నారన్నారు. కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారాల కోసం తన అనుచరులకు, అన్నదమ్ములకు, కుటుంబ సభ్యులకు కాంట్రాక్టులు ఇవ్వడం కోసం మూసీ పేరుతో భారీ స్కామ్‌కు తెరలేపారని ఇందుకోసం పేదల ఇళ్లను పణంగా పెడుతున్నారన్నారని సంచలన ఆరోపించారు.గతంలో తమ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కేవలం 16 వేల కోట్ల రూపాయలతోనే మూసీ సుందరీకరణ కార్యక్రమాన్ని ఒక్క ఇల్లు కూడా పోకుండా డీపీఆర్‌ని కూడా సిద్ధం చేశామని కేటీఆర్ తెలిపారు. కేవలం సుందరీకరణ మాత్రమే కాకుండా రోడ్లతో పాటు ఫ్లైఓవర్లను కూడా తమ ప్రణాళికలో ఉంచామని, కానీ ఎక్కడా కూడా ఒక్క ఇల్లుకు ఇబ్బంది కాకుండా చూశామన్నారు. అలాంటి అంశాన్ని పక్కన పెట్టి లక్షన్నర కోట్ల రూపాయల దోపిడీ కోసం వేలమంది ఇళ్లను ధ్వంసం చేస్తూ రేవంత్ రెడ్డి కొత్త స్కామ్‌కి తెరలేపారని ఆరోపించారు. మూసీ బఫర్ జోన్‌కి సంబంధించి రకరకాల మాటలు చెప్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం, ఆరోజు అధికారంలో ఉన్నప్పుడు ఇదే అపార్ట్‌మెంట్లకు పర్మిషన్ ఇచ్చిందని, మరి అలాంటి అధికారుల పైన, ఆనాడు అనుమతులు ఇచ్చిన కాంగ్రెస్ నాయకులను చెప్పుతో కొట్టాలా? అని కేటీఆర్ సంచలన కామెంట్స్ చేశారు. ఇప్పటికైనా రేవంత్ రెడ్డి మూసీ ప్రాజెక్టు కోసం వేలమంది ఇళ్లను కూల్చడం ఆపేయాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న బెదిరింపులకు, ఇండ్లకు బదులు డబ్బులు ఇస్తామని మోసం చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలకు లొంగకుండా ఐక్యంగా ముందుకు సాగాలని మూసీ సుందరీకరణ ప్రాజెక్టు బాధితులకు కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

# ఒక్క దెబ్బకు 48 మందిని లేపేశాం

అటు ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు కూడా ఇది తమ ఉనికి కోసం జరుగుతున్న యుద్ధమని, దాడులను మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. అయితే, తమ నాయకుడి మరణంతో రగిలిపోతున్న ఇరాన్ ప్రతీకార దాడులకు దిగింది. ఇజ్రాయెల్‌లోని బీట్ షెమెష్‌పై బాలిస్టిక్ మిస్సైల్స్‌తో దాడి చేయడంతో 8 మంది మరణించారు. అటు గల్ఫ్ జలాల్లోని ఇంధన ట్యాంకర్లే లక్ష్యంగా ఇరాన్ దాడులు చేస్తోంది. ఈ దాడుల్లో ఓ ట్యాంకర్ పూర్తిగా మునిగిపోగా, మరొకటి ధ్వంసమైంది. ఈ ఘటనలో భారతీయులు కూడా గాయపడటం ఆందోళన కలిగిస్తోంది. దుబాయ్, అబుదాబి, దోహా వంటి ప్రధాన నగరాల్లో పేలుళ్ల శబ్దాలు వినిపించడంతో ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు. మరోవైపు, ఇరాన్ తన క్షిపణులతో అమెరికా యుద్ధ నౌక 'యూఎస్ఎస్ అబ్రహం లింకన్'పై దాడి చేశామని ప్రకటించుకుంది. అయితే అమెరికా సెంట్రల్ కమాండ్ ఈ వార్తలను ఖండించింది. ఇరాన్ క్షిపణులు తమ దరిదాపుల్లోకి కూడా రాలేదని కొట్టిపారేసింది. ఖమేనీ మరణం తర్వాత ఇరాన్‌లో తాత్కాలిక పాలక మండలి ఏర్పాటైంది. అయతోల్లా అలిరెజా అరాఫీని తాత్కాలిక సుప్రీం లీడర్‌గా నియమించారు. ఈ యుద్ధ ప్రభావం సామాన్యులపైనా తీవ్రంగా పడుతోంది. పాకిస్థాన్‌లోని అమెరికా కాన్సులేట్ వద్ద జరిగిన నిరసనల్లో 9 మంది మరణించారు. యుద్ధం కారణంగా గగనతలం మూసివేయడంతో విమానయాన రంగం కుదేలయ్యింది. భారత్ నుంచి వెళ్లాల్సిన 50కి పైగా ఎయిర్ ఇండియా విమానాలు, ఢిల్లీ ఎయిర్‌పోర్టులో 100కు పైగా సర్వీసులు రద్దయ్యాయి. రష్యా, చైనా ఈ దాడులను ఖండించగా పరిస్థితి ఇంకా ఏ మలుపు తిరుగుతుందోనని ప్రపంచం ఉత్కంఠగా ఎదురుచూస్తోంది.

## దుబాయ్‌లో చిక్కుకుపోయిన పూనే విద్యార్థులు.. కీలక ప్రకటన చేసిన స్కూల్ యాజమాన్యం



స్టడీ విజిట్ కోసం ఇండియా నుంచి దుబాయ్ వెళ్లిన కొందరు విద్యార్థులు అక్కడే చిక్కుకుపోయారు. పూనేకు చెందిన 84 మంది విద్యార్థులు ఇటీవల స్టడీ విజిట్‌లో భాగంగా దుబాయ్ వెళ్లారు. అయితే, ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం నేపథ్యంలో దుబాయ్‌లోనే చిక్కుకుపోయారు. ప్రస్తుతం దుబాయ్‌పై ఇరాన్ దాడి చేస్తున్న సంగతి తెలిసిందే. ఆదివారం కూడా దాడులు కొనసాగుతున్నాయి.దీంతో అక్కడి ఎయిర్‌పోర్టుల్ని మూసివేశారు. ఫలితంగా విమానాల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ కారణంగా పలువురు భారతీయులు దుబాయ్‌లో చిక్కుకుపోయారు. ఇందులో సినీ తారలు, క్రీడాకారులు, వ్యాపారవేత్తలు సహా సాధారణ ప్రజలు, టూరిస్టులు ఉన్నారు. వారిలో పూనేలోని ఒక పాఠశాలకు చెందిన 84 మంది విద్యార్థులు ఉన్నారు. అయితే, ఈ అంశంపై స్కూల్ యాజమాన్యం స్పందించింది. విద్యార్థుల బృందమంతా ప్రస్తుతానికి క్షేమంగానే ఉన్నారని, ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని ప్రకటించింది. వీలైనంత త్వరగా విద్యార్థుల్ని ఇండియా తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపింది. విదేశీ వ్యవహారాల శాఖ, దుబాయ్‌లోని భారతీయ రాయబార కార్యాలయం కూడా విద్యార్థుల బృందాన్ని సంప్రదించింది.అలాగే కేంద్ర పౌరవిమానయాన శాఖ కూడా ఈ అంశంపై దృష్టి సారించింది. పరిస్థితి సద్దుమణిగి, విమానాల రాకపోకలు ప్రారంభమైన వెంటనే విద్యార్థుల్ని తీసుకొస్తామని తెలిపాయి. ప్రస్తుతం దుబాయ్‌పై ఇరాన్ దాడి చేస్తుండటంతో అక్కడి పరిస్థితి ఆందోళనకరంగా ఉంది.

## నాగ్‌పూర్‌లో ఘోర ప్రమాదం..పేలుడు పదార్థాల తయారీ పరిశ్రమలో పేలుడు 15 మంది మృతి

హైదరాబాద్ : మహారాష్ట్రలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. ఎస్‌బీఎల్ ఎనర్జీ లిమిటెడ్(రాదీూ జుఅవతీస్ర్రఎ ాాఅఎఠ్వఎ) పేలుడు పదార్థాల తయారీ పరిశ్రమలో భారీ పేలుడు సంభవించి 15 మంది మృతి చెందారు. పలువురు గాయపడ్డారు. ఈ విసాదకర సంఘటన నాగ్‌పూర్(చీఅగ్రజూబతీ )జిల్లా కటోల్ సమీపంలోని రాహుల్‌గావ్‌లోని పేలుడు పదార్థాల తయారీ కర్మాగారంలో జరిగింది. వివరాల్లోకి వెళ్తే..ఆదివారం ఉదయం ఎప్పటిలాగే కార్మికులు పని చేస్తుండగా ఒక్కసారిగా పేలుడు సంభవించినట్లు సమాచారం. పేలుడు ధాటికి భవనం ధ్వంసమైంది. 15 మంది కార్మికులు మరణించినట్లు పోలీసులు వెల్లడించారు. శిథిలాల కింద మరికొందరు చిక్కుకున్నట్లు సమాచారం. రంగంలోకి దిగిన అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలను చేపట్టింది. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ఏపీ జ్యుడీషియల్ అకాడమీకి శంకుస్థాపన

ఈ అకాడమీలో 500 మంది కూర్చునే సామర్థ్యం కలిగిన అత్యాధునిక ఆడిటోరియంతో పాటు, శిక్షణ పొందే వారి కోసం గ్రౌండ్ ప్లస్ 8 (జి౦8) అంతస్తులతో కూడిన భారీ హాస్టల్ బ్లాక్‌ను నిర్మిస్తున్నారు. వీటితో పాటు, అమరావతిలో హైకోర్టు న్యాయమూర్తుల కోసం 69.4 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో, 50 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించనున్న ప్రత్యేక అతిథిగృహానికి కూడా జస్టిస్ సూర్యకాంత్ శంకుస్థాపన చేశారు. న్యాయ వ్యవస్థలో మధ్యవర్తిత్వం కీలక పాత్ర పోషిస్తుందని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. మధ్యవర్తిత్వం వల్ల అనేక కేసులు సులువుగా పరిష్కారం అవుతాయని ప్రతి సమస్యకు కోర్టుకు రావడమే పరిష్కారం కాదన్నారు. రోజురోజుకూ పెరిగిపోతున్న కుటుంబ తగాదాల వల్ల కోర్టుల్లో కేసులు బాగా పెరుగుతున్నాయని సీజేఐ అన్నారు. అమరావతిలో నిర్వహించిన మధ్యవర్తిత్వంపై రాష్ట్రస్థాయి సదస్సుకు హాజరైన ఆయన మాట్లాడుతూ మధ్యవర్తిత్వం వల్ల కేసులు వేగంగా పరిష్కారం అవుతాయని, అయితే న్యాయం జరుగుతుందని ఇరుపక్షాలు నమ్మాలి. న్యాయవ్యవస్థపై ఎంతో నమ్మకంతో ప్రజలు కోర్టులకు వస్తున్నారు. కానీ చాలా కేసుల్లో మధ్యవర్తిత్వం ద్వారా కోర్టులకు రాకుండా సమస్యలు పరిష్కారం అవుతాయి. మధ్యవర్తిత్వం ద్వారా పలు దేశాల్లో కేసులు పరిష్కారం చేసుకుంటున్నారు. మనదేశంలోనూ మధ్యవర్తిత్వం వైపు మొగ్గుచూపితే సుదీర్ఘకాలం కోర్టుల చుట్టూ తిరిగే అవసరం ఉండదని, అదే సమయంలో ఇరుపక్షాలకు న్యాయం జరుగుతుందని' అని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ అన్నారు.

# ప్రతీ సోమవారం ధర్మవాణి కార్యక్రమం

తమ ఫిర్యాదులు, విజ్ఞప్తులను అందించవచ్చని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. ఎంత కింది స్థాయి ఉద్యోగులు, సిబ్బంది అయినా సరే ఎలాంటి మధ్యవర్తులు లేకుండా నేరుగా డైరెక్టర్‌ను కలిసి తమ బాధలు వెళ్లబోసుకునే అవకాశం కల్పించినట్లు దేవాదాయ శాఖ అధికారులు తెల్చి చెప్పారు.ధర్మవాణి కార్యక్రమానికి వచ్చే దరఖాస్తులను స్వయంగా డైరెక్టర్ పరిశీలించనున్నారు. ఇక వారు అందించిన సమస్యలను బట్టి వెంటనే పరిష్కారం చూపించనున్నారు. ఇక మరికొన్ని పెద్ద సమస్యలు ఉంటే వాటిని గరిష్టంగా వారం రోజుల వ్యవధిలోనే పరిష్కరిస్తామని డైరెక్టర్ హనుమంతరావు హామీ ఇచ్చారు. కేవలం ప్రధాన కార్యాలయ సమస్యలే కాకుండా డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కార్యాలయాల పరిధిలో కూడా పెండింగ్‌లో ఉన్న సమస్యలను కూడా ఈ ధర్మవాణి కార్యక్రమం ద్వారా పరిష్కరించనున్నట్లు స్పష్టం చేశారు. ఈ ధర్మవాణి కార్యక్రమానికి మరో ప్రత్యేకత ఉందని సంబంధిత అధికారులు వెల్లడించారు. ఒక దరఖాస్తుపై తీసుకున్న నిర్ణయాన్ని సంబంధిత వ్యక్తులకు ఆ కార్యాలయం నుంచి.. ఫోన్, ఇతర మార్గాల ద్వారా సమాచారాన్ని అందించనున్నారు. ఒకవేళ టెక్నికల్, చట్టపరమైన కారణాల వల్ల ఏ సమస్యకైనా పరిష్కారం చూపించలేకపోతే.. దానికి గల కారణాలను కూడా దరఖాస్తు చేసిన వారికి పూర్తిగా వివరించనున్నారు. దీనివల్ల సేవల్లో మరింత పారదర్శకత పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.రాష్ట్రంలోని దేవాదాయ శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు, అర్చకులు తమ సమస్యల కోసం ఉన్నతాధికారుల ఆఫీసుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా ఈ ధర్మవాణి కార్యక్రమాన్ని తీసుకువచ్చామని అయితే ఈ అవకాశాన్ని అందరు ఉద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని డైరెక్టర్ హనుమంత రావు కోరారు. ఇది కేవలం ఫిర్యాదుల విభాగం మాత్రమే కాకుండా శాఖలో మరింత జవాబుదారీతనాన్ని పెంచేందుకు ఒక మార్గంగా నిలుస్తుందని పేర్కొన్నారు.

# టెంపుల్ టూరిజం ప్రాంతంగా ములుగు

పాడిపంటలతో రైతన్నలు ఆనందంగా ఉండాలని, ప్రతి ఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలని ఆ స్వామిని వేడుకోవడం జరిగింది. భక్తులు కోరిన కోరికలను ఆ స్వామి తీరుస్తారనే విశ్వాసం ఉంది. స్వామి వారిని దర్శించుకునే భక్తుల సౌకర్యార్థం అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ములుగు జిల్లాలో ప్రసిద్ధి చెందిన పర్యాటక కేంద్రాలు నెలవై ఉన్నాయి. సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా మేడారంలో అభివృద్ధి పనులు చేపట్టాం. 200 సంవత్సరాల వరకు చెక్కుచెదరకుండా ఉండే విధంగా ఆలయాన్ని అభివృద్ధి చేశాం. మేడారం మహా జాతరను విజయవంతం చేశాం.గోదావరి పరివాహక ప్రాంతమైన బాసర నుంచి భద్రాచలం వరకు టెంపుల్ టూరిజం ప్రాంతంగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. వాటికి సంబంధించిన పనులు కూడా త్వరలోనే ప్రారంభిస్తాం. మంత్రి సీతక్క కోరిక మేరకు మల్లూరు దేవాలయాన్ని అద్భుతంగా ప్రభుత్వం అభివృద్ధి చేస్తుంది. భక్తుల మనోభావాలను అభిప్రాయాలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తుంది. త్వరలోనే ఆలయ అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం చేస్తాం.' అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. ఇక అంతకు ముందు మంత్రి పొంగులేటి కుటుంబ సమేతంగా సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ దివాకర, ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకన్, అదనపు కలెక్టర్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మోదీ అధ్యక్షతన అత్యవసర సమావేశం

మోదీ సమావేశమయ్యారు. ఈ సమావేశానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగ మంత్రి ఎస్జై శంకర్ హాజరయ్యారు. తాజా పరిస్థితులను సైనిక అధికారుల నుంచి మోదీ సమీక్షించారు. మరోవైపు, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా అత్యవసరంగా ఆర్మీ ఉన్నతాధికారులతో భేటీ కానున్నారు.

ఆదివారం ఉదయం జమ్మూ ప్రాంతంలో జనావాసాలపై పాక్ వైపు నుంచి షెల్లింగ్ జరిగింది. గడిచిన కొన్ని రోజులుగా సరిహద్దు రేఖపై ఎదురుదాడులు కొనసాగుతుండగా, తాజాగా ఇది జనావాస ప్రాంతాలకు చేరడం ఆందోళన కలిగిస్తోంది. ఈ షెల్లింగ్ ఘటనలో పలు ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఆ సమయంలో ప్రజలు ఇళ్లలోనే ఉండడంతో భయానక పరిస్థితులు నెలకొన్నాయి. అయితే, ఈ ఘటనలో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు అని అధికారులు తెలిపారు. ఈ షెల్లింగ్ సమయంలో ప్రజలు తక్షణమే రక్షణ కోసం శరణు పొందినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అక్కడ పరిస్థితిని సైనికులు గమనిస్తున్నారు. పరిస్థితిని సమీక్షించిన తర్వాత రక్షణ మంత్రి, విదేశాంగ మంత్రి మీడియాతో మాట్లాడాల్సి ఉండగా, అనివార్య కారణాల వల్ల ఆ ప్రెస్ మీట్ను వాయిదా వేశారు.ఈ నేపథ్యంలో సరిహద్దు ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. కేంద్రం సమగ్రంగా పరిస్థితిని పరిశీలిస్తూ, అవసరమైన నిర్ణయాలు తీసుకునే దిశగా చర్యలు ప్రారంభించింది.

## ఇరాన్ తాత్కాలిక సుప్రీం లీడర్‌గా
# అయతొల్లా అరాఫీ

అసెంబ్లీ ఆఫ్ ఎక్స్‌పర్ట్స్ తదుపరి పూర్తిస్థాయి సుప్రీం లీడర్‌ను ఎన్నుకునే వరకు ఈ కౌన్సిల్ బాధ్యతలు నిర్వహిస్తుంది. రష్యన్ మీడియా సంస్థ 'ఆర్టీ' (ఆర్టీ) కథనం ప్రకారం 1959లో ఇరాన్‌లోని మేబోద్‌లో జన్మించిన అయతొల్లా అరాఫీ, షియా మతగురువుగా, ఇస్లామిక్ న్యాయనిపుణుడిగా పేరు పొందారు. 2016 నుంచి ఇరాన్ ఇస్లామిక్ సెమినరీస్ మేనేజ్‌మెంట్ సెంటర్ హెడ్‌గా, ప్రఖ్యాత కోమ్ సెమినరీ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. దేశ చట్టాలను, ఎన్నికలను పర్యవేక్షించే శక్తివంతమైన గార్డియన్ కౌన్సిల్‌లో కూడా ఆయన సభ్యుడిగా ఉన్నారు. గతంలో 2008 నుంచి 2018 వరకు అల్-ముస్తఫా ఇంటర్నేషనల్ యూనివర్సిటీ ప్రెసిడెంట్‌గా కూడా అరాఫీ పనిచేశారు.

## ఫిబ్రవరి నెల జీఎస్టీ వసూళ్లలో
# మహారాష్ట్ర టాప్

విశేషం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025-26)లో ఫిబ్రవరి 28 నాటికి మొత్తం స్థూల జీఎస్టీ ఆదాయం రూ.20.27 లక్షల కోట్లకు చేరింది. వార్షిక ప్రాతిపదికన చూస్తే ఇది 8.3 శాతం వృద్ధిని సూచిస్తోంది. ఇక ఫిబ్రవరిలో రూ.22,595 కోట్ల రీఫండ్లు చెల్లించారు. రీఫండ్లు సర్దుబాటు చేసిన తర్వాత నికర జీఎస్టీ ఆదాయం రూ.1.61 లక్షల కోట్లుగా నమోదైంది.

దేశీయ లావాదేవీల ద్వారా వచ్చిన ఆదాయం 5.3 శాతం వృద్ధితో రూ.1.36 లక్షల కోట్లుగా ఉండగా దిగుమతుల ద్వారా వచ్చిన రాబడిలో మాత్రం 17.2 శాతం భారీ వృద్ధి కనిపించింది. దిగుమతుల ద్వారా రూ.47,837 కోట్లు సమకూరాయి. అయితే, సెస్ వసూళ్లు మాత్రం ఆందోళనకరంగా తగ్గాయి. గతేడాది ఫిబ్రవరిలో రూ.13,481 కోట్లుగా ఉన్న నికర సెస్ ఈసారి రూ.5,063 కోట్లకు పడిపోయింది. రాష్ట్రాల వారీగా చూస్తే మిశ్రమ ఫలితాలు కనిపించాయి. పారిశ్రామిక రాష్ట్రాల్లో వృద్ధి నమోదు కాగా, వనరుల ఆధారిత రాష్ట్రాల్లో వసూళ్లు తగ్గాయి. మహారాష్ట్ర రూ.10,286 కోట్ల వసూళ్లతో దేశంలోనే అగ్రస్థానంలో నిలవగా కర్ణాటక, గుజరాత్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, తమిళనాడు, రాజస్థాన్, బీహార్ వంటి రాష్ట్రాల్లో సానుకూల వృద్ధి నమోదు కాగా పశ్చిమ బెంగాల్, మధ్యప్రదేశ్, ఒడిశా, ఝార్ఖండ్ వంటి రాష్ట్రాల్లో ఆదాయం తగ్గింది. జీఎస్టీ 2.0 తర్వాత వసూళ్లు స్థిరంగా పెరుగుతున్నాయని, ఆర్థిక వ్యవస్థలో డిమాండ్ బలంగా ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. దిగుమతుల రాబడి పెరగడం అంతర్జాతీయ వాణిజ్య కార్యకలాపాల జోరును సూచిస్తోందని పేర్కొన్నారు.

## నగరంలోని అమెరికా రాయబార కార్యాలయం వద్ద భద్రత కట్టుదిట్టం




ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు దాడులకు పాల్పడటం.. అందుకు ప్రతీకారంగా ఇరాన్ ప్రతిదాడులు చేస్తుండటం లాంటి పరిణామాల నేపథ్యంలో పశ్చిమాసియాలో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. మరోవైపు అమెరికా–ఇజ్రాయెల్ దాడిలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖమేనీ చనిపోవడాన్ని ఖండిస్తూ పలు దేశాల్లోని అమెరికా రాయబార కార్యాలయాల దగ్గర ఆందోళనలు జరుగుతున్నాయి. పాకిస్థాన్‌లోని కరాచీ నగరంలో అమెరికా కాన్సులేట్ దగ్గర జరిగిన ఘర్షణల్లో 10 మంది ప్రాణాలు కోల్పోయారు.ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని అమెరికా కాన్సులేట్ దగ్గర గచ్చిబౌలి పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు. నానక్‌రామ్‌గూడలోని యూఎస్ కాన్సులేట్ వద్ద భారీగా బలగాలను మోహరించారు. ఖమేనీ మృతిని నిరసిస్తూ నిరసన ర్యాలీలు జరిగే అవకాశం ఉందన్న నిఘా వర్గాల సమాచారంతో పోలీసులు ఈ నిర్ణయం తీసుకున్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా ముందస్తు చర్యగా కాన్సులేట్ పరిసరాలను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. కాన్సులేట్ వైపు వెళ్లే ప్రధాన రహదారిని తాత్కాలికంగా మూసివేసి బారికేడ్లను ఏర్పాటు చేశారు. అటువైపుగా వెళ్లే వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు.

### ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో నుజ్జునుజ్జయిన కారు..


## ఇద్దరు అన్నలు సహా చెల్లెలు మృతి



అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మండలం గుబనపల్లి జాతీయ రహదారిపై ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురెదురుగా వచ్చిన ఆర్టీసీ బస్సు, కారు ఒకదానికొకటి బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాద ధాటికి కారు నుజ్జునుజ్జయ్యింది. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు.అనంతపురం నుంచి రాయదుర్గానికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలను చేపట్టారు. కారులో ఇరుక్కుపోయిన మృతదేహాలను బయటకు తీసి, పోస్టుమార్టం నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతులను కర్ణాటకలోని ముదిగలకు చెందిన చంద్రకళ (32), ఆమె సోదరులు శివకుమార్ (36), హనుమంత రాయుడు (40)గా గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేపట్టారు.

### బ్యాంకు ఉద్యోగిని కరిచిన కుక్క..

## రేబిస్ భయంతో ఆత్మహత్య



ముంబై: బ్యాంకులో పనిచేస్తున్న ఉద్యోగిని కుక్క కరిచింది. దీంతో అతడు ఒక్క డోస్ యాంటీ రేబిస్ ఇంజెక్షన్ తీసుకున్నాడు. అయితే రేబిస్ సోకినట్లు భయాందోళన చెందాడు. ఇంట్లో ఎవరూ లేనప్పుడు ఆ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. (bank staffer dies by suicide) మహారాష్ట్రలోని థానే జిల్లాలో ఈ సంఘటన జరిగింది. కల్యాణ్ ప్రాంతంలో నివసించే 30 ఏళ్ల ఆయుష్ విశ్వనాథ్ అమీన్ గత ఎనిమిది ఏళ్లుగా భారత్ బ్యాంక్ థానే బ్రాంచ్‌లో పనిచేస్తున్నాడు.కాగా, కొన్ని రోజుల కిందట టిస్గావ్ నాకా ప్రాంతంలో ఆయుష్ కాలుపై కుక్క కరిచింది. ఈ నేపథ్యంలో అతడు ఒక డోసు యాంటీ–రేబిస్ ఇంజెక్షన్ మాత్రమే తీసుకున్నాడు. అయితే తనకు రేబిస్ సోకినట్లు ఆందోళన చెందాడు.మరోవైపు కొన్ని రోజులుగా ఆయుష్ ప్రవర్తనలో మార్పులను కుటుంబ సభ్యులు గమనించారు. అయితే ఫిబ్రవరి 22న ఇంట్లో ఎవరూ లేని సమయంలో అతడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలి

### – బీఆర్ఎస్ గ్లోబల్ ఎన్ఆర్ఐ కోఆర్డినేటర్ మహేష్ బిగాల



గల్ఫ్ ప్రాంతంలో ప్రస్తుతం నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ముఖ్యంగా Iran, United States మధ్య జరుగుతున్న యుద్ధ పరిణామాల ప్రభావం గల్ఫ్ దేశాలపై పడుతున్నది. ఈ సందర్భంలో బీఆర్ఎస్ గ్లోబల్ ఎన్ఆర్ఐ కోఆర్డినేటర్ మహేష్ బిగాల మాట్లాడుతూ .. గల్ఫ్ దేశాలలో నివసిస్తున్న తెలంగాణ బిడ్డలందరూ క్షేమంగా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని, స్థానిక అధికారుల సూచనలను తప్పకుండా పాటించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఏ విధమైన సహాయం అవసరమైనా, గల్ఫ్ దేశాలలో ఉన్న బీఆర్ఎస్ ఎన్ఆర్ఐ ప్రతినిధులను వెంటనే సంప్రదించాలని సూచించారు. అక్కడ ఉన్న ఎన్ఆర్ఐ ప్రతినిధులతో తాము నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని, పరిస్థితులను క్షణక్షణం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. తెలంగాణ ప్రజల భద్రత మా ప్రాధాన్యత అని, అవసరమైతే అన్ని విధాల సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉన్నామని మహేష్ బిగాల స్పష్టం చేశారు.

## కుదేలైన టమాట రైతు..

# ధరలు పడిపోవడంతో తెంపలేక చేనులోనే..!



రాయపోల్ : ఊహించని విధంగా టమాట ధరలు పడిపోవడంతో రైతన్నలు దిక్కుతోచని స్థితిలోకి వెళ్లిపోయారు. మొన్నటివరకూ బాగా పలికిన టమాట ధర ఇప్పుడు అమాంతం పడిపోవడంతో పెట్టుబడి కూడా రావడం లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. కనీసం చేనులో టమాట తెంపినందుకు కూలీలకు చెల్లించాల్సిన డబ్బులు, రవాణా ఖర్చులు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ మాత్రం గిట్టుబాటు కాకపోవడంతో టమాట తెంపకుండానే చేనులోనే వదిలేస్తున్నారు.సిద్ధిపేట జిల్లా రాయపోల్ మండలంలో నీటి వసతి అంతంత మాత్రమే ఉన్న చోట రైతులు కూరగాయల సాగుపై ఎక్కువ దృష్టి పెట్టారు. ఇందులో అధిక మొత్తంలో టమాట సాగు చేశారు. అయితే ఒక్కసారిగా టమాట ధర పడిపోవడంతో పెట్టుబడులు రాని పరిస్థితి నెలకొన్నదని రైతులు వాపోతున్నారు. కనీసం కూలీలు, పంట తరలించే రవాణా చార్జీలు కూడా గిట్టుబాటు కాకపోవడంతో చేనులోనే వదిలేస్తున్నామని తెలిపారు. 20 రోజుల క్రితం మార్కెట్‌లో కిలో రూ.30 ధర పలుకగా పండించిన రైతుకు రూ.20 వచ్చేది. కానీ ప్రస్తుతం మార్కెట్లో కిలో రూ.5 నుంచి రూ.10 మధ్య ధర పలుకడంతో హోల్‌సేల్ కిలో రూ.2 కూడా రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాయపోల్ మండలంలోని తిమ్మక్కపల్లి గ్రామానికి చెందిన ఎకరం టమాట పంట సాగు చేశాడు. అయితే పంట సాగు చేసి చేతికి వచ్చిన హయాంలో ధర పడిపోవడంతోపాటు అకాల వర్షానికి పంట నష్టం జరగడంతో ప్రకాశ్ బోరున విలపించారు.

## పశ్చిమాసియా దేశాల్లో.. మార్చి 2న జరగాల్సిన

# పరీక్షలను సీబీఎస్ఈ వాయిదా




న్యూఢిల్లీ: అమెరికా–ఇరాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో పలు పశ్చిమాసియా దేశాలలో మార్చి 2న జరగాల్సిన పరీక్షలను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ సెకండరీ ఎడ్యుకేషన్ (సీబీఎస్ఈ) వాయిదా వేసింది. (జదీూజు జుఝుఎం) మార్చి 2న జరగాల్సిన 10, 12 తరగతుల బోర్డు పరీక్షలను వాయిదా వేసినట్లు సీబీఎస్ఈ ఆదివారం ప్రకటించింది. పరీక్ష నిర్వహించే కొత్త తేదీలను త్వరలో తెలియజేస్తామని పేర్కొంది. మార్చి 3న సమీక్ష తర్వాత మార్చి 5 నుంచి జరుగాల్సిన మిగతా పరీక్షల నిర్వహణపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించింది. బహ్రెయిన్, ఇరాన్, కువైట్, ఒమన్, ఖతార్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లోని 150కు పైగా సీబీఎస్ఈ అనుబంధ పాఠశాలల ప్రిన్సిపాల్‌లకు ఈ సమాచారం పంపినట్లు పేర్కొంది.కాగా, సీబీఎస్ఈ 10, 12 తరగతుల బోర్డు పరీక్షలు ఫిబ్రవరి 18న ప్రారంభమయ్యాయి. భారత్‌తో పాటు విదేశాల్లోని 25.1 లక్షల మంది 10వ తరగతి విద్యార్థులు, 18.6 లక్షల మంది 12వ తరగతి విద్యార్థులు సహా మొత్తం 43.7 లక్షలకుపైగా విద్యార్థులు సీబీఎస్ఈ పరీక్షలకు హాజరవుతున్నారు. మరోవైపు సీబీఎస్ఈకి పశ్చిమాసియాలో పెతిపెద్ద విదేశీ క్లస్టర్ ఉన్నది. దుబాయ్, అబుదాబి, దోహా, రియాద్‌లో కీలకమైన పరీక్షా కేంద్రాలున్నాయి. అయితే అమెరికా, ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్ సుప్రీం కమాండర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణించారు. దీంతో ఇజ్రాయెల్‌తో పాటు గల్ఫ్ దేశాల్లోని అమెరికా సైనిక స్థావరాలపై ప్రతీకార దాడులకు ఇరాన్ పాల్పడుతున్నది. ఈ నేపథ్యంలో పశ్చిమాసియా దేశాల్లో మార్చి 2న సోమవారం జరుగాల్సిన పరీక్షలను సీబీఎస్ఈ వాయిదా వేసింది.

## దండోరా అనే వేగుచుక్క మాదిగ వాడల్లో

# అగ్గి పుట్టించింది : ఎమ్మార్పీఎస్ నేతలు



బచ్చన్నపేట : బచ్చన్నపేట మండల కేంద్రంలోని బాబు జగ్జీవన్ రామ్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ ఆవరణంలో ఎమ్మార్పీఎస్, ఎస్సీ ఉపకులాల నాయకుల ఆధ్వర్యంలో మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటాలకు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ మూడు దశాబ్దాల ఎమ్మార్పీఎస్ ఉద్యమ ప్రస్థానంలో ఎస్సీ వర్గీకరణ సాధన కోసం జరిగిన అనేక ఉద్యమ ఘట్టాలలో వీరోచితమైన పాత్రను పోషించిదన్నారు. జాతి లక్ష్యాన్ని సాధించడం కోసం తృణప్రాయంగా తమ అమూల్యమైన ప్రాణాలను అర్పించి నేలరాలిన మాదిగ అమరవీరులకు సామాజిక ఉద్యమ జోహార్లు, కన్నీటి నివాళులు అర్పించారు.త్యాగాలు లేకుండా ఏ పోరాటం గమ్యాన్ని ముద్దాడలేదని అన్నారు. పోరాటాలు లేకుండా విజయం ఏనాడు దరి చేరలేదని జాతి మీద చీకట్లు కమ్ముకున్నప్పుడు దండోరా అనే ఒక వేగుచుక్క మాదిగ వాడల్లో అగ్గి పుట్టించిందన్నారు. అది తరతరాల జాతిని చీకటి పారదోలుతూ జాతికి వెలుగులు తీసుకొచ్చిందన్నారు. ఈ వెలుగులు సాధించడం కోసం నడిచిన పోరుబాటలో అనేకమంది బిడ్డలు అసువులు బాసారని అన్నారు.నాడు వారి అమరత్వం సాక్షిగా వర్గీకరణను సాధిస్తామని అన్నారు. నేడు ఆ ప్రమాణం సాక్షిగా ఎస్సీ వర్గీకరణ సాధించి అమరుల ఆశయాలను నెరవేర్చామన్నారు. ఎస్సీ వర్గీకరణ ఫలితాలు మాదిగ సమాజం పొందుతున్న వేళ మాదిగ అమరులను మది నిండా తలచుకొని ఘనమైన నివాళులు అర్పిద్దామని అని వారి త్యాగాలను ప్రపంచానికి ఎలుగెత్తి చాటి చెప్పుదామని అన్నారు .ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పైస రాజశేఖర మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి అల్వాల రాజు మాదిగ, ఎంఎస్పీ మండల అధ్యక్షుడు పాకాల కుమార స్వామిమాదిగ, మండల సీనియర్ నాయకుడు బొడ్డు నవీన్ మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు అల్వాల విజయ్ కుమార్ మాదిగ, టౌను ప్రధాన కార్యదర్శి, గంధ మల్ల నాగరాజు, కొల్లూరు సంపత్, చెల్లపురం శ్రీకాంత్ మాదిగ, కొమ్ము శ్రీకాంత్ మాదిగ, అల్వాల మహేష్ మాదిగ, కర్రె శ్రీనివాస్ మాదిగ, గంధమల్ల మల్లేష్ మాదిగ, వీహెచ్పీఎస్ మండల నాయకుడు ఆల్వాల స్వామి మాదిగ, బేడ బుడగల జంగాల హక్కుల సమితి మండల అధ్యక్షుడు సిరిపాటి రామదాసు తదితరులు పాల్గొన్నారు.

### కుమార్తెను నదిలోకి విసిరేసిన మహిళ..

## ఆమె దూకబోగా కాపాడిన వ్యక్తి



లక్నో: తల్లితో గొడవ కారణంగా ఒక మహిళ నది వద్దకు చేరుకున్నది. కుమార్తెను నదిలోకి విసిరేసింది. ఆ తర్వాత ఆమె కూడా నదిలో దూకేందుకు ప్రయత్నించింది. ఒక వ్యక్తి ఆ మహిళను కాపాడాడు. నదిలో మునిగిన ఆమె కుమార్తె కోసం గాలిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని బందా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. 30 ఏళ్ల రుబినా యాదవ్ వివాదం నేపథ్యంలో అత్తింటి కుటుంబాన్ని వీడింది. గత ఐదేళ్లుగా ఇద్దరు పిల్లలతో కలిసి తల్లి ఇంట్లో నివసిస్తున్నది.కాగా, శుక్రవారం రుబినా యాదవ్, ఆమె తల్లి మధ్య గొడవ జరిగింది. దీంతో సాయంత్రం ఐదు గంటల సమయంలో ఐదేళ్ల కుమార్తె పింకీని తీసుకుని యమునా నది వద్దకు ఆమె చేరుకున్నది. కుమార్తెను నదిలోకి విసిరేసింది. ఆ తర్వాత నదిలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు పయత్నించింది.మరోవైపు గమనించిన ఒక వ్యక్తి రుబినాను కాపాడాడు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. కుమార్తెను నదిలోకి విసిరేసినట్లు రుబినా చెప్పింది. దీంతో ప్రయాగ్‌రాజ్ నుంచి రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళాన్ని రప్పించారు. నదిలో మునిగిన ఆ బాలిక కోసం గాలిస్తున్నారు. రుబినాకు ఏడేళ్ల కొడుకు చింటు కూడా ఉన్నట్లు పోలీస్ అధికారి తెలిపారు.

## వెజ్ బిర్యానీ షాప్ ఫ్రీజర్‌లో

### యువకుడి మృతదేహం.. చూసి షాకైన యజమాని



ఉత్తర ప్రదేశ్‌లోని లక్నోలో దారుణం జరిగింది. మూసి ఉన్న ఒక వెజ్ బిర్యానీ షాపు ఫ్రీజర్‌లో యువకుడి మృతదేహం కనిపించడం కలకలం రేపింది. తన షాపులోని ఫ్రీజర్‌లో మృతదేహం కనిపించడంతో షాపు యజమాని షాకయ్యాడు. ఈ ఘటన స్థానికుల్ని కూడా షాక్‌కు గురి చేసింది. దీనిపై షాపు యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసుల వివరాల ప్రకారం.. లక్నో, బక్షి కా తలాబ్ పోలీస్ స్టేషన్ పరిధిలో, జీసీఆర్‌జీ అనే కాలేజీ సమీపంలో ఒక వెజ్ బిర్యానీ షాపు ఉంది.ఈ షాపు యజమాని నాలుగు రోజుల క్రితం షాపును మూసేసి తన తండ్రి అంత్యక్రియల కోసం వెళ్లాడు. అనంతరం తిరిగి వచ్చిన తర్వాత షాపు ఓపెన్ చేసి, ఫ్రీజర్‌లో చూడగా, యువకుడి మృతదేహం కనిపించింది. అంతే.. ఫ్రీజర్‌లో యువకుడి మృతదేహం కనిపించడతో యజమాని షాకయ్యాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు అక్కడికి చేరుకుని, యువకుడి మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించాడు. మృతుడికి సంబంధించిన వివరాలేవీ ఇంకా తెలియరాలేదు. మూసేసిన షాపులోకి మృతదేహం ఎలా వచ్చిందా అని పోలీసులు ఆరా తీస్తున్నారు.షాపు యజమానిని ప్రశ్నిస్తున్నారు. చుట్టుపక్కల ఉన్న సీసీ కెమెరాల్ని పరిశీలిస్తున్నారు. అతడు ఎలా మరణించాడు.. మృతదేహం ఎలా అక్కడికి వచ్చింది.. వంటి వివరాల్ని ఆరా తీస్తున్నారు. అన్ని కోణాల్లో దీనిపై విచారణ జరుపుతున్నట్లు డీసీపీ గోపాల్ క్రిష్ణ చౌదరి తెలిపారు. ఈ ప్రాంతంలో భద్రతను కట్టుదిట్టం చేయడంతోపాటు నిఘాను పటిష్టం చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

# బాల్యం జ్ఞాపకాలతో ఘనంగా 1987 - 88 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థుల సమ్మేళనం

**- 38 ఏళ్ల సుదీర్ఘ కాలం అనంతరం**

**చీర్లవంచ పూర్వ విద్యార్థుల హర్షోత్సాహ సమ్మేళనం**




వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ అర్బన్ మండలంలోని చీర్లవంచ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1987--1988 విద్యాసంవత్సరంలో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు 38 ఏళ్ల సుదీర్ఘ కాలం అనంతరం మళ్లీ ఒకేచోట కలుసుకొని ఆదివారం ఘనంగా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అగ్రహారం శ్రీ కన్వెన్షన్‌లో జరిగిన ఈ సమావేశం స్మృతుల సందడిగా మారింది.పాఠశాల రోజులను గుర్తు చేసుకుంటూ విద్యార్థులు అప్పటి తరగతి గదుల సంఘటనలు,ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం,స్నేహబంధాల మాధుర్యాన్ని పంచుకున్నారు. “కాలం మారినా మన స్నేహం మారలేదు” అని పలువురు భావోద్వేగంతో అన్నారు. చిన్ననాటి సరదాలు గుర్తుచేసుకొని నవ్వుల్లో మునిగిపోయారు.ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బొడ్డు ఆంజనేయులు, నేరెళ్ల అజిత్ కుమార్, దుంద్రపల్లి లక్ష్మీనారాయణ, కడపత్రి వెంకటేశ్వరరావు, నళిని (బెంగళూరు) తదితరులు పాల్గొన్నారు. అప్పటి ఉపాధ్యాయులు మానువాడ శంకర్, ధర్మయ్య, శ్రీనివాస్ రెడ్డి హాజరై విద్యార్థులను ఆశీర్వదించారు.ప్రస్తుతం వ్యాపార రంగం, పోస్టాఫీస్ విభాగం, పోలీస్ శాఖలో కానిస్టేబుళ్లుగా, ఇతర ప్రభుత్వ, ప్రైవేట్ విభాగాల్లో పనిచేస్తున్న పూర్వ విద్యార్థులు తమ అనుభవాలను పంచుకున్నారు. గురువులకు ఘన సన్మానం చేసి కృతజ్ఞతలు తెలిపారు.భవిష్యత్తులో ప్రతీ సంవత్సరం ఇలాంటి సమావేశాలను నిర్వహిస్తూ స్నేహబంధాలను మరింత బలపర్చుకోవాలని నిర్ణయించారు.

# చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సహకారంతో నెరవేరిన సొంతింటి కల

**- నిరుపేదలకు సొంతింటి కల్పనలో ప్రజా ప్రభుత్వం ముందంజ**

**- ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారు: దూస హరిత - వేణు**



బోయినిపల్లి (ప్రశ్న న్యూస్1) ప్రజా సంక్షేమ కార్యక్రమాల అమలులో భాగంగా నిర్మించిన ఇందిరమ్మ గృహంలో దూస హరిత - వేణు కుటుంబం ఆదివారం గృహప్రవేశ వేడుకను ఘనంగా నిర్వహించింది. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ, “సొంత ఇల్లు అనేది ఎన్నో ఏళ్లుగా మాకు ఉన్న ఆశ. ప్రజా ప్రభుత్వం తీసుకొచ్చిన ఇందిరమ్మ పథకం ద్వారా ఆ ఆశ నిజమైంది” అని పేర్కొన్నారు.ఇందుకు ముఖ్యంగా చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం కృషి కారణమని, ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని దూస హరిత - వేణు తెలిపారు. నిరుపేదలు, మధ్యతరగతి కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపరచడంలో ప్రజా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని అన్నారు.ఈ గృహప్రవేశ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నిమ్మ వినోద్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ పిట్టల మోహన్, దూస జనార్ధన్,మహేందర్, గుంటి జలందర్,నల్లగొండ శ్రీనివాస్,ఆనంతుల సాయి, గుంటి తిరుపతి తదితరులు పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.అర్హులైన ప్రతి కుటుంబానికి గూడు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందిరమ్మ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో గృహ నిర్మాణాలు వేగంగా కొనసాగుతున్నాయని నాయకులు తెలిపారు.

# కుల చేతి వృత్తులకు 80 శాతం సబ్సిడీ రుణాలను ఇవ్వాలి

**- బీసీలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలి**

**- కొండ దేవయ్య పటేల్**

**- కామారెడ్డిలో బీసీ హక్కుల కోసం గళమెత్తిన బీసీ సాధికారత సంఘం నాయకులు**



వేములవాడ (ప్రశ్న న్యూస్) రానున్న తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం నిధులు కేటాయించి, బీసీ సబ్‌ప్లాన్‌ను చట్టబద్ధంగా అమలు చేయాలని బీసీ సాధికారిత సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు కొండ దేవయ్య పటేల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ డిక్లరేషన్‌లో ప్రతి ఏడాది రూ.20,000 కోట్ల చొప్పున ఐదేళ్లకు లక్ష కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ మాట నిలబెట్టుకోవాలని ఆయన కోరారు.బీసీ కులాలకు చెందిన ఆర్థిక కార్పొరేషన్లు, ఫెడరేషన్లకు తగిన నిధులు కేటాయించి, వాటి ద్వారా 80 శాతం సబ్సిడీపై రుణాలు అందించాలని,అంతరించిపోతున్న కులచేతి వృత్తులకు పూర్వ వైభవం తీసుకురావాలని సూచించారు. బీసీ విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8,500 కోట్లు తక్షణమే విడుదల చేయాలని, గత బడ్జెట్‌లో కేటాయించిన నిధులను మార్చి చివరి వరకు పూర్తిగా వినియోగించాలని డిమాండ్ చేశారు.ఏప్రిల్ 9న ఖాళీ కాబోయే రెండు రాజ్యసభ స్థానాలను బీసీలకే కేటాయించాలని, ప్రస్తుతం రాష్ట్రం నుండి ఉన్న 7 మంది రాజ్యసభ సభ్యుల్లో కేవలం ఇద్దరే బీసీలు ఉన్నారని, జనాభా దామాషా ప్రకారం నలుగురు ఉండాలని కొండ దేవయ్య పటేల్ పేర్కొన్నారు. సామాజిక న్యాయం మాటల్లో కాకుండా చేతల్లో చూపాలని అన్ని రాజకీయ పార్టీలను ఆయన కోరారు.ఉత్తర తెలంగాణ జిల్లాల బీసీ సాధికారిత సంఘం ఇంచార్జీ పొలాస నరేందర్ మాట్లాడుతూ, “రైతు భరోసా” జాప్యం వల్ల బీసీ, ఎస్సీ, ఎస్టీ రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. వ్యవసాయానికి పెట్టుబడిగా రావాల్సిన నిధులు ఆలస్యమవడంతో రైతులు వడ్డీలకు అప్పులు తీసుకోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు భరోసా పథకాన్ని రాజకీయ కోణంలో చూడకుండా వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో రాష్ట్ర బీసీ సాధికారిత సంఘం కార్యదర్శి పొలాస వాసు, జిల్లా ఉపాధ్యక్షులు చింతల కోటి రామ స్వామి గౌడ్, జిల్లా కోశాధికారి కత్రోజు ప్రభాకర్, జిల్లా యువత ఉపాధ్యక్షులు పొలాస హరీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# తాడేపల్లిలో ఊపందుకున్న జనసేన ఉద్యమి మెంబర్‌షిప్ డ్రైవ్

**చిల్లపల్లి శ్రీనివాస్ ఆదేశాలతో ఇంటింటి ప్రచారం**

**ఉద్యమిలుగా, ప్రదాతలుగా ప్రజ్వలిల్లండి - జొన్న రాజేష్**




ఉండవల్లి(ప్రశ్న న్యూస్)జనసేన క్రియాశీల సభ్యత నమోదు కార్యక్రమం ఉండవల్లి సెంటర్లో జనసేన మంగళగిరి నియోజకవర్గ నాయకులు జొన్న రాజేష్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం భారీ క్యాంపెయిన్ చేపట్టారు.ఇంటింటికి వెళ్లి ఉద్యమిగా ఉద్యమించి ప్రదాతగా ప్రజ్వలిల్లాలని జనసేనాని పవన్ కళ్యాణ్ ఆశయ సాధనకు అనుగుణంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ వెళ్లిన ప్రతి ఇంటికి ఆత్మీయుడీలా ఆదరించిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. పవన్ కళ్యాణ్ ఒక డైనమిక్ లీడర్ అని డైమండ్ అని ఆంధ్ర రాష్ట్రానికి పవన్ కళ్యాణ్ అవసరం ఉందని ఆయనకి పూర్తిస్థాయిలో సహాయ సహకారాలు అందిస్తారని ప్రజలు ముందుకు వచ్చారని ఈ సందర్భంగా రాజేష్ తెలిపారు.జనసైన్యం సాధక్ లుగా చిల్లపల్లి శ్రీనన్న ఆదేశాలతో ఇంటింటికి వస్తున్నామని ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు గుర్రాల శేషగిరి, దాసరి దుర్గా మల్లేశ్వరరావు, సామల శశి, గాజుల సాయి తేజ,అఖిల్, బన్నీ, శశిధర్, హర్ష తదితరులు పాల్గొన్నారు.

# అన్ని వర్గాలను అలరించేలా ‘సంప్రదాయని సుద్దిని సుద్దపూసని’




విశాఖపట్నం(ప్రశ్న న్యూస్ )శ్రీ శివాజీ ప్రొడక్షన్ బ్యానర్‌పై శివాజీ, లయ జంటగా నటించిన సరికొత్త చిత్రం “సంప్రదాయని సుద్దిని సుద్దపూసని”. ఈ నెల 6వ తేదీన ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్న నేపథ్యంలో, చిత్ర యూనిట్ ఆదివారం ఉదయం విశాఖపట్నంలో మీడియా సమావేశాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా హీరో శివాజీ, హీరోయిన్ లయ చిత్ర విశేషాలను పంచుకున్నారు. హీరో శివాజీ మాట్లాడుతూ ఇది ఒక విభిన్నమైన డార్క్ కామెడీ చిత్రమని తెలిపారు. “గతంలో లయ-నేను కలిసి చేసిన మూడు సినిమాలను ప్రేక్షకులు ఎలాగైతే ఆదరించారో, ఈ సినిమాను కూడా అలాగే ఆదరించాలని కోరుతున్నాను. సాంకేతిక పరంగా అత్యున్నత ప్రమాణాలు పాటించాం. ముఖ్యంగా సినిమా ఆఖరి 45 నిమిషాలు ఎంతో ఆసక్తికరంగా ఉంటుంది. మాస్టర్ రోహన్ పాత్ర అద్భుతంగా నటించాడు” అని పేర్కొన్నారు. రాజకీయ, సామాజిక అంశాలపై స్పందిస్తూ “ఒక పక్క ప్రజల కోసం మాట్లాడుతూనే, మరోపక్క కుటుంబాల కోసం సినిమాలు చేస్తాను. అధికారంలో ఏ పార్టీ ఉన్నా ప్రజల శ్రేయస్సు కోసం నా గళం వినిపిస్తూనే ఉంటాను. విశాఖలో సినీ పరిశ్రమ అభివృద్ధి చెందాలి, లేదంటే ఇక్కడి వారు ఉపాధి కోసం మళ్లీ హైదరాబాద్, చెన్నై వెళ్లాల్సిన పరిస్థితి వస్తుంది” అని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో స్త్రీ వస్త్రధారణపై తాను చేసిన వ్యాఖ్యలు ఎవరినీ ఉద్దేశించినవి కావని, అవి తన వ్యక్తిగత భావనలు మాత్రమేనని ఆయన క్లారిటీ ఇచ్చారు. హీరోయిన్ లయ మాట్లాడుతూ విశాఖపట్నంతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. “నా తాతగారి స్వస్థలం విశాఖ కావడంతో చిన్నప్పుడు ఇక్కడే పెరిగాను. ఈ చిత్రంలో నా పాత్ర పేరు ‘ఉత్తర’. భర్త మీద చూపించే అతి ప్రేమ ఎలాంటి ఇబ్బందులకు దారితీస్తుందనే అంశాన్ని కామెడీగా, వినోదాత్మకంగా తెరకెక్కించారు. ఇది కేవలం ఫ్యామిలీ సినిమా మాత్రమే కాదు, అన్ని వయసుల వారు చూసి ఎంజాయ్ చేసేలా ప్రమోట్ చేయాలని కోరుతున్నాను” అని తెలిపారు.

# రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్ట్ సీమ ప్రజల జీవనాడి

**రాయలసీమహక్కుల కోసం వైఎస్ఆర్ సిపి ఘోష.**

**కడపలో 6 జిల్లాల ప్రతినిధులతో మహా రౌండ్ టేబుల్ సమావేశం**

**రాయలసీమ హక్కుల కోసం అన్ని శక్తుల ఐక్యం స్పష్టమైన కార్యాచరణ..ప్రజా ఉద్యమానికి నాంది**



కడప (ప్రశ్న న్యూస్) రాయలసీమ హక్కుల సాధన కోసం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కడపలోని మేడా కన్వెన్షన్ లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం రాజకీయంగా విశేష ప్రాధాన్యం సంతరించుకుంది. రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్ట్ సాధనపై స్పష్టమైన కార్యాచరణతో, ప్రజా ఉద్యమానికి నాంది పలుకుతూ ఈ సమావేశం జరిగింది.ఈ కీలక సమావేశానికి పార్టీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, మాజీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ లు వైఎస్ అవినాష్ రెడ్డి, గురుమూర్తి, మాజీ మంత్రులు కాకాని గోవర్ధన్ రెడ్డి,మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ బాష, ఆర్ కె రోజా,ఉషశ్రీ చరణ్,సాకే శైలజా నాద్ , ఆదిమూలపు సురేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, కడప, అన్నమయ్య జిల్లాల అధ్యక్షులు రవీంద్రనాథ రెడ్డి, ఆకేపాటి అమర నాథ రెడ్డి, మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్,రాజంపేట పరిశీలకులు సురేష్ బాబు, అనంత వెంకట్రామి రెడ్డి, కాటసాని రామ్ భూపాల్ రెడ్డి, ఎస్ వి మోహన్ రెడ్డి, బూచేపల్లె శివ ప్రసాద్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీష్ రెడ్డి, హిందూపురం పరిశీలకులు రమేష్ కుమార్ రెడ్డి, ఎం ఎల్ఏలు, ఎంఎల్ సి లు,మాజీ ఎంఎల్ఏ లు, ప్రజాప్రతినిధులు, పార్టీ కీలక నేతలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. సమావేశంలో నేతలు ఒకే స్వరంతో రాయలసీమకు జరుగుతున్న అన్యాయాలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వైఖరి కారణంగా రాయలసీమకు జరుగుతున్న తీరని నష్టం, అభివృద్ధి ఆవకాశాల కోల్పోవడం, సాగునీటి హక్కులపై పడుతున్న ముప్పు వంటి అంశాలపై తీవ్రంగా చర్చించారు. సీమ హక్కుల కోసం రాజీ పడబోమని, అవసరమైతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమ జ్వాలలు రగిలిస్తామని నేతలు హెచ్చరించారు.రాయలసీమకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని ఈ సమావేశం ద్వారా నేతలు స్పష్టమైన సందేశం ఇచ్చారు.

# మార్చి 1 నుంచి మండే ఎండలు

**విశాఖపట్టణం,** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకున్నాయి. అల్పపీడన ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో మూడ్రోజుల నుంచి పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన అకాల వర్షాలు కురుస్తున్నాయి. దక్షిణ అంతర్గత కర్ణాటక ప్రాంతం నుంచి మహారాష్ట్రలోని మార్త్వాడా వరకు వ్యాపించి ఉన్న ద్రోణి వాయువ్య దిశగా కదులుతుంది.

దీని ప్రభావంతో శుక్రవారం సంగారెడ్డి, రంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. దీంతో ఆయా జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ది ప్రభావంతో హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో ఆకాశం మేఘావృతమై ఉండి, కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలంలో 4.36 సెంటీమీటర్ల మేర అత్యధిక వర్షపాతం నమోదైంది. మహబూబాబాద్ జిల్లా గూడూరులో అత్యల్పంగా 1.38 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ఇక సిద్దిపేట, వికారాబాద్, వరంగల్, యాదాద్రి భువనగిరి, మహబూబ్‌నగర్, జయశంకర్ భూపాలపల్లి వంటి పలు జిల్లాల్లో మోస్తరు వర్షం కురిసింది. ఈ అకాల వర్షాలకు రైతులు దారుణంగా నష్టపోతున్నారు. పలు జిల్లాల్లో మొక్కజొన్న, శనగ, జొన్న పంటలు నేలకొరిగాయి. గింజ పాలు పోసుకునే దశలో మొక్కజొన్న నేలవాలడంతో ఎదుగుదల కష్టమని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చెబుతున్నారు. పలు ప్రాంతాల్లో శుద్ధి చేసి ఆరబెట్టిన పసుపు గాలివానకు తడిసిపోయింది. శనివారం నుంచి వాతావరణం సాధారణ స్థితికి చేరుకునే అవకాశం ఉంది. ఉక్కపోతలు కూడా రేపట్నుంచి మొదలవుతాయని వాతావరణ కేంద్రం వివరించింది. ప్రస్తుతం రాష్ట్రంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు 33 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రతలు 21గా నమోదవుతున్నాయి. మార్చి 1 నుంచి ఎండలు మండిపోతాయని జనాలు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

# కష్టాల్లో ఉన్నా నోరుతెరవని ఫైర్ బ్రాండ్స్

**విజయవాడ** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చాలామంది ఫైర్ బ్రాండ్లు ఉన్నారు. ఎందుకో గాని వారంతా ఇప్పుడు సైలెంట్ గా ఉన్నారు. అసలు వారు యాక్టివ్ అవుతారా? లేదా? అనే చర్చ బలంగా నడుస్తోంది. ఎందుకంటే ఇప్పుడు పార్టీ కష్టకాలంలో ఉంది. వారి అవసరం పార్టీకి ఏర్పడింది. అయినా సరే వారి పెద్దగా నోరు తెరవడం లేదు. ఏదో పార్టీలో ఉన్నాం అంటే ఉన్నాం అన్నట్టు ఉంది వారి వ్యవహారం. కనీసం నోరు తెరవడం లేదు కూడా వారు. కూటమి ప్రభుత్వం నుంచి నెయ్యి కల్తీ వ్యవహారంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి సవాళ్లు ఎదురవుతున్నాయి.

ఇటువంటి సమయంలో అండగా నిలవాల్సిన ఈ ఫైర్ బ్రాండ్లు అంతా ముఖం చాటేస్తుండడం మాత్రం విమర్శలకు తావిస్తోంది. పార్టీ కష్టంలో ఉన్నప్పుడే స్పందించాలి కానీ.. పార్టీ బాగున్నప్పుడు ఎందుకులే అనే ప్రశ్న వినిపిస్తోంది.ఎవరు అవునన్నా కాదన్నా నెయ్యి కల్తీ వ్యవహారంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి భారీ డ్యామేజ్ జరిగింది. దానిని కంట్రోల్ చేసే పనిలో భాగంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి బలమైన వాయిస్ వినిపిస్తోంది. కానీ ఇది చాలడం లేదు. ఎవరో ఒకరిద్దరు మాత్రమే స్పందిస్తున్నారు. ముఖ్యంగా మాజీ మంత్రులు ఆర్కే రోజా, అనిల్ కుమార్ యాదవ్, కొడాలి నాని, వల్లభనేని వంశీ మోహన్ వంటి వారు నోరు తెరవకపోవడం పై రకరకాల చర్చ నడుస్తోంది. 2014 నుంచి 2019 వరకు వైయస్సార్ కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు.. 2019 నుంచి 2024 మధ్య అధికారంలో ఉన్నప్పుడు.. వీరు ఓ స్థాయిలో రెచ్చిపోయేవారు. అధినేత జగన్ పై ఈగ వాలనిచ్చేవారు కాదు. కానీ ఇప్పుడు అమాంతం పెద్దపెద్ద నిందలు, ప్రత్యర్థుల బలమైన ఆరోపణలు చేస్తున్నా స్పందించకపోవడం ఏమిటనే ప్రశ్న వినిపిస్తోంది.పార్టీ అధికారంలో ఉన్నప్పుడు చాలామంది మాట్లాడతారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మాట్లాడితేనే.. పార్టీ తరపున వాయిస్ వినిపిస్తేనే ఫలితం ఉంటుంది. అయితే వైసిపి హయాంలో ఫైర్ బ్రాండ్లుగా పేరు పొందిన ఈ నేతలంతా ఆడిన మాటలు రాష్ట్ర ప్రజలకు తెలియంది కాదు. అందుకే ఫలానా ఫైర్ బ్రాండ్ ఏమైపోయారు అని ప్రజలు ఇప్పుడు ఆరా తీయడం చూస్తున్నాం. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో ప్రస్తుతం ఒకరిద్దరు నేతలు మాత్రమే మాట్లాడుతున్నారు. మిగతావారు మాత్రం ఫుల్ సైలెన్స్ పాటిస్తున్నారు. అందుకే సోషల్ మీడియాలో సెటైర్లు పడుతున్నాయి. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫైర్ బ్రాండ్లకు ఏమైందని ఎక్కువ మంది ప్రశ్నిస్తున్నారు. అయితే ఇందులో కొందరు తమ సొంత వృత్తులు, వ్యాపారాలు చేసుకుంటున్నారు. పరిస్థితికి తగ్గట్టు బయటకు రావాలని భావిస్తున్నారు. అప్పటివరకు సైలెంట్ మోడ్ లో ఉండడమే ఉత్తమని ఒక నిర్ణయానికి వచ్చారన్నమాట

# సెంటిమెంట్ నుంచి సమస్యల దిశగా

**హైదరాబాద్,** అసెంబ్లీ ఎన్నికల తర్వాత బలహీనంగా కనిపిస్తున్న భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ఇప్పుడు పూర్తిగా మారిన వ్యూహంతో ముందుకు సాగుతోంది. ఒకప్పుడు సెంటిమెంట్ ఆధారంగా నడిచిన పార్టీ, ఇప్పుడు ప్రజా సమస్యలను ఆయుధంగా మార్చుకుంటూ “గ్రౌండ్ లెవల్ రీకనెక్ట్” పై దృష్టి సారించింది. పైకి ప్రశాంతంగా కనిపిస్తున్నా, లోపల మాత్రం గులాబీ దళం పునర్వ్యవస్థీకరణకు అధినేత కేసీఆర్ నిశ్శబ్దంగా కార్యాచరణ చేపట్టారు.పార్టీని మళ్లీ బలోపేతం చేయాలంటే క్షేత్రస్థాయి నుంచి మొదలు పెట్టాలనే నిర్ణయానికి బీఆర్ఎస్ వచ్చింది. అందుకే ఇప్పుడు హైదరాబాద్ రాజకీయాలకు పరిమితం కాకుండా జిల్లాలపై ఫోకస్ పెంచుతోంది.

వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేరుగా బాధితుల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకుంటూ ప్రభుత్వంపై విమర్శలు మోస్తున్నారు.భూసేకరణ, భూముల వివాదాలు, రైతుల సమస్యలు, నిరుద్యోగం వంటి అంశాలపై ప్రత్యక్షంగా స్పందిస్తూ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపే ప్రయత్నం చేస్తున్నారు. ఖమ్మం, నాగర్ కర్నూల్ వంటి జిల్లాల్లో ఇప్పటికే పర్యటనలు ప్రారంభించారు. త్వరలో రైతు ఆత్మహత్యల కుటుంబాలను కూడా పరామర్శించేలా ప్లాన్ చేస్తున్నారు.ఎర్రవెల్లి ఫామ్‌హౌస్ కేంద్రంగా కేసీఆర్ రాజకీయ వ్యూహాలు రచిస్తున్నారు. బయటకు పెద్దగా కనిపించకపోయినా, పార్టీని మళ్లీ నిలబెట్టేందుకు క్రమంగా పావులు కదుపుతున్నారు. నియోజకవర్గాల వారీగా కీలక నేతలతో టెలికాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తూ ఓటమి కారణాలను విశ్లేషిస్తున్నారు.కార్యకర్తల్లో నెలకొన్న నిరుత్సాహాన్ని తొలగించి, “మళ్లీ మనదే పాలన” అనే నమ్మకాన్ని కలిగించే ప్రయత్నం జరుగుతోంది.

అలాగే సోషల్ మీడియా వేదికగా ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రత్యేక బృందాలను కూడా సిద్ధం చేస్తున్నారు.పార్టీ నుంచి కొందరు నేతలు వెళ్లిపోతున్నా, కేసీఆర్ మాత్రం తొందరపడటం లేదు. పార్టీ మారే వారిని ఆపేందుకు కంటే, మిగిలిన నిబద్ధత గల నాయకులతో బలమైన బృందాన్ని నిర్మించాలనే దిశగా అడుగులు వేస్తున్నారు.ద్వితీయ శ్రేణి నాయకత్వానికి ప్రాధాన్యం ఇస్తూ, ప్రతి మండలానికి ఇన్‌ఛార్జ్‌లను నియమించాలనే ఆలోచనలో ఉన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఇప్పటినుంచే క్యాడర్‌ను సిద్ధం చేస్తున్నారు. గతంలో తెలంగాణ సెంటిమెంట్‌పై ఆధారపడి విజయాలు సాధించిన బీఆర్ఎస్, ఇప్పుడు పూర్తిగా ప్రజా సమస్యలపై దృష్టి మళ్లిస్తోంది. నిరుద్యోగ భృతి, రైతు రుణమాఫీ, పెన్షన్ల పంపిణీలో జాప్యం వంటి అంశాలను ప్రభుత్వంపై అస్త్రాలుగా ఉపయోగించేందుకు సిద్ధమవుతోందిప్రజా సమస్యలపై పోరాటం ద్వారా కోల్పోయిన విశ్వాసాన్ని తిరిగి సంపాదించుకోవచ్చని పార్టీ భావిస్తోంది. శాసనసభలో కూడా ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టేలా వ్యూహాలు సిద్ధం చేస్తున్నారు.బయటకు నిశ్శబ్దంగా కనిపిస్తున్నా, బీఆర్ఎస్ లోపల భారీ మార్పులు జరుగుతున్నాయి. సరైన సమయం చూసి పార్టీని పూర్తిగా రీ యాక్టివేట్ చేయాలనే లక్ష్యంతో కేసీఆర్ ముందుకు సాగుతున్నారు.గోదావరి జలాల పేరుతో బహిరంగ సభల ద్వారా పార్టీకి కొత్త ఊపు తీసుకురావాలని భావించినా, ఎన్నికల నేపథ్యంలో ఆ ప్లాన్ వాయిదా పడింది. అయితే, పరిస్థితులు అనుకూలంగా మారిన వెంటనే గులాబీ దళం మళ్లీ పూర్తి స్థాయిలో రంగంలోకి దిగే సూచనలు కనిపిస్తున్నాయి.ఓటమి తర్వాత వెనక్కి తగ్గినట్టుగా కనిపించిన బీఆర్ఎస్, ఇప్పుడు కొత్త రూపంలో తిరిగి వస్తోంది. కేసీఆర్ సైలెంట్ ఆపరేషన్, కేటీఆర్ గ్రౌండ్ యాక్టివిటీ, కొత్త నాయకత్వం కలయికతో గులాబీ దళం మళ్లీ బలపడుతుందా అన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.

## మాంబోజిపల్లి సంతలో

# ఐదు తులాల బంగారు నగల చోరీ

### రూ.8లక్షల విలువ గల నగలు అపహరణ



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) మాంబోజీ పల్లి సంతలో 5తులాల బంగారు ఆభరణాలు చోరి అయిన సంఘటన శనివారం సాయంత్రం జరిగింది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రమైన కొల్చారంకు చెందిన చింతలగారి శ్రావణి ప్రవీణ్ భార్య భర్తలు మెదక్ వెళ్లి తిరిగి ప్రయాణం లో సంతలో కూరగాయలు తీసుకోవడానికి వెళ్ళారు. తమ వద్ద ఉన్న హాండ్ బ్యాగులో ఉన్న రూ. 8లక్షల విలువ గల 5తులాల బంగారు నగలు నెక్లెస్ 2.5, నల్లపూసలు 2తులలు,మాటిలు,చెవి కమ్మలు అర తులం చోరి జరిగాయి . బాధితులు కొద్దిసేపటి కి హ్యాండ్ బ్యాగ్ చూడగా కనిపించకుండా పోవడంతో కంగుతిన్న బాధితులు మెదక్ లో రూరల్ పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై లింగం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# మెదక్ జిల్లాలో జూదంపై ఉక్కుపాదం

### టాస్క్ ఫోర్స్ దాడుల్లో 9 మంది అరెస్ట్

### రూ.28,296 నగదు, 6 మొబైల్ ఫోన్లు, ఒక కారు, 5 బైక్లు స్వాధీనం

### మెదక్ జిల్లా ఎస్పీ డి. వి. శ్రీనివాస రావు



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం బుజరాంగ్‌పల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న వారిపై టాస్క్ ఫోర్స్ పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించి 9 మందిని అరెస్ట్ చేశారు. జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు ఆదేశాల మేరకు ఈ ఆపరేషన్ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.విశ్వసనీయ సమాచారం ఆధారంగా టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 9 మంది జూదగాళ్లను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ. 28,296 నగదు మరియు 6 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.అరెస్టయిన వారిని వడ్ల ఎల్లం, వంజరి మల్లేశం, ఉసికె దుర్గేష్, బక్క వీరేశం, మహంకాళి ప్రకాష్, గుడాల హరి, పనిముక్కలా రామ్ శశిధర్ గౌడ్, గంగారాం మల్లేశం, జాతీగరి కృష్ణగా పోలీసులు గుర్తించారు. వారిని కౌడిపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో పేకాట, బెట్టింగ్ వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇలాంటి అక్రమాల వల్ల అనేక కుటుంబాలు నష్టపోతున్నాయని, ముఖ్యంగా యువత తప్పుదారుల్లోకి వెళ్లకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందించి ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

# చేగుంటలో భార్య హత్య, నిందితుడి అరెస్ట్

### డబ్బుల కోసం భార్యను పరతో కొట్టి హత్య

### రామాయంపేట్ సీఐ వెంకట రాజా గౌడ్




మెదక్ ప్రతినిధి( ప్రశ్న న్యూస్ ) డబ్బుల కోసం భార్యను పరతో కొట్టి హత్య చేసిన కేసును రామాయంపేట్ పోలీసులు దాకచక్యంగా ఛేదించారు. ఈ మేరకు నిర్వహించిన మీడియా సమావేశంలో రామాయంపేట్ సీఐ వెంకట రాజా గౌడ్ కేసు వివరాలను వెల్లడించారు.ఆయన తెలిపిన వివరాల ప్రకారం... 2015 సంవత్సరంలో మృతురాలు వరలక్ష్మి, నిందితుడు ముతా త్రిమూర్తులకు రెండో వివాహం జరిగింది. వివాహానంతరం నిందితుడు ఇల్లరికం వచ్చి చేగుంటలో నివాసం ఉంటూ వచ్చాడు. వీరికి దుర్గాప్రసాద్ (10) అనే కుమారుడు ఉన్నాడు.రెండు సంవత్సరాల క్రితం కుటుంబ పోషణ కోసం వరలక్ష్మి కాళ్ళకల్ ఐటిసి కంపెనీలో ఉద్యోగానికి వెళ్లడం ప్రారంభించింది. ఈ నేపథ్యంలో నిందితుడు ఎలాంటి పని చేయకుండా ఇంట్లోనే ఉంటూ భార్యను డబ్బుల కోసం వేధించేవాడు. తరచూ జరిగే గొడవలతో భార్యపై ద్వేషం పెంచుకున్న నిందితుడు ఆమెను హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు.

తేదీ 21.02.2026 అర్ధరాత్రి భార్య, కుమారుడు నిద్రిస్తున్న సమయంలో ఇంట్లో ఉన్న పరతో వరలక్ష్మి తలపై దాడి చేయగా ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం మృతురాలి వద్ద ఉన్న 39.55 గ్రాముల బంగారు పుస్తెలతాడు, రూ. 5,000 నగదు, సెల్ ఫోన్ తీసుకుని అన్నవరం పారిపోయాడు.నమ్మదగిన సమాచారం మేరకు రామాయంపేట్ సీఐ వెంకట రాజా గౌడ్ నేతృత్వంలో ప్రత్యేక బృందం నిఘా ఏర్పాటు చేసి, 01.03.2026 ఉదయం చేగుంట బస్టాండ్ వద్ద నిందితుడిని అరెస్ట్ చేసింది. అతని వద్ద నుంచి బంగారు పుస్తెలతాడు, రెండు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకుని జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలించారు.ఈ కేసును ఛేదించిన రామాయంపేట్ సీఐ వెంకట రాజా గౌడ్, తూప్రాన్ సీఐ రంగకృష్ణ, చేగుంట ఎస్ఐ చైతన్యకుమార్ రెడ్డి, ఎస్ఐ భిక్యా నాయక్, కానిస్టేబుళ్లు భాస్కర్, రాజశేఖర్, సాజిద్ అలీ, హోంగార్డ్ రవీందర్‌లను మెదక్ జిల్లా ఎస్పీ అభినందించారు.

## నిరాశ్రయ వృద్ధురాలికి

# "మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్" అండ

- పోలీసుల సమన్వయంతో వృద్ధురాలికి "అమ్మ అనాథ ఆశ్రమం" లో ఆశ్రయం
- మానవ సేవే మాధవ సేవా నినాదంతోనే ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నాం
- అమ్మ అనాథ వృద్ధాశ్రమం నిర్వాహకులు : గడ్డం తిరుమల - శ్రీనివాస్





వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా, వేములవాడ పట్టణానికి చెందిన "మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్" మరోసారి మానవత్వాన్ని చాటుతూ ఓ నిరాశ్రయ వృద్ధురాలికి ఆశ్రయం కల్పించిన సంఘటన ఆదివారం వేములవాడలో చోటుచేసుకుంది. మహారాష్ట్ర,షోలాపూర్ వాస్తవ్యురాలు లక్ష్మీబాయి (76) రాజన్న దర్శనానికి వచ్చి తిరిగి స్వస్థలానికి వెళ్లే పరిస్థితి లేదని,తనకు ఎవరూ లేరని తెలిపి ఇక్కడే ఆశ్రయం కల్పించాలని హోమ్ గార్డ్ శైలజను ఆశ్రయించింది.ఈ విషయాన్ని హోమ్ గార్డ్ శైలజ, మై వేములవాడ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు మధు మహేష్‌కు తెలియజేశారు. వెంటనే స్పందించిన ట్రస్ట్ సభ్యులు వృద్ధురాలిని ఆటోలో పోలీస్ స్టేషన్‌కు తరలించి, అవసరమైన విధి విధానాలు పూర్తి చేశారు. పోలీసుల అనుమతితో తంగళ్లపల్లి మండలం,ఓబులాపూర్‌లోని "అమ్మ అనాథ వృద్ధాశ్రమం" నిర్వాహకులు గడ్డం తిరుమల – శ్రీనివాస్‌ను పిలిపించి, లక్ష్మీబాయిని సురక్షితంగా,అధికారికంగా వృద్ధాశ్రమానికి తరలించారు.ఈ సందర్భంగా ట్రస్ట్ తరఫున వృద్ధురాలికి దుప్పట్లు,చీరలు, కొంత నగదు ఆర్థికసాయం అందజేశారు. "ఎవరూ లేని వృద్ధులకు అండగా నిలవడం మా బాధ్యతగా భావిస్తున్నాం. సమాజం కూడా ఇలాంటి సందర్భాల్లో ముందుకు రావాలి" అని ట్రస్ట్ నిర్వాహకులు మధు మహేష్ పిలుపునిచ్చారు.అనంతరం వృద్ధాశ్రమం నిర్వాహకులు మాట్లాడుతూ "మానవ సేవే మాధవ సేవ" అనే నినాదంతో ఆశ్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వేములవాడ టౌన్ సబ్ ఇన్స్పెక్టర్ రాంమోహన్, రైటర్ రమణారెడ్డి, హోమ్ గార్డ్ శైలజ, అమ్మ అనాథ వృద్ధాశ్రమం నిర్వాహకులు గడ్డం తిరుమల – శ్రీనివాస్,ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

## సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో

# యధావిధిగా ప్రజావాణి

### మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్



మెదక్ ప్రతినిధి (ప్రశ్న న్యూస్ ) 2026 మార్చి 02 తేదీ సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో యధావిధిగా ప్రజావాణి కొనసాగుతుందని ప్రజల సద్వినియోగం చేసుకోవాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.ప్రజావాణిపై కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార దిశగా ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు జిల్లా అధికారులందరూ సమయపాలనతో తప్పనిసరిగా ప్రజావాణికి హాజరుకావాలని ఈ సందర్భంగా కలెక్టర్ వెల్లడించారు.

## జిల్లాస్థాయి బంజారాల

# హోలీ పండుగ సంబరాలు



ధర్పల్లి( ప్రశ్న న్యూస్) నిజామాబాద్ జిల్లా ధర్పల్లి మండల కేంద్రంలో బంజారాల ఆరాధ్య దైవమైన శ్రీ సేవాలాల్ మహారాజ్ ఆశీస్సులతో బంజారా లు ఎక్కడ ఉన్న ఏ ప్రాంతంలో ఉన్న జగదాంబ మాత ఆశీస్సులతో సుఖసంపదలు కలిగి ఉంటారని బంజారాల జాతీయ సేవా సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ మోతిలాల్ నాయక్ అన్నారు. జిల్లా స్థాయి బంజారాల హోలీ లెంగా సంబరాల వేడుకలను ప్రారంభించి వేడుకలలో పాల్గొన్నారు.ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ని అన్ని గిరిజన గ్రామాల నుండి బంజారాలు అధిక సంఖ్యలో పాల్గొని హోలీ పండుగ వేడుకల్లో పాల్గొన్నారు.ప్రత్యేక పూజలు భోగ్ బండార్, యజ్ఞం నిర్వహించారు. .శ్రీ సంత సేవాలాల్ మహారాజ్ ఆశీస్సులతో బంజారా జాతి ప్రపంచంలో అందరూ సుఖశాంతులతో ఉండాలని, అన్ని రంగుల కలయికతో ఆనందంగా ఉన్నా ఈ వేసవికాలం ఆరంభంలో ఆకులని రాలిపోయి ఎండిపోయి ఎర్రని మోదుగ పూలు వికసించినట్టు బంజారా జాతి వికసించి ఎక్కడున్నా ఆ ప్రాంతం అష్ట ఐశ్వర్యాలతో సౌభాగ్యంతో కళకళలాడుతుందని అన్నారు. సమాజంలో బంజారా లు తమ వంతు బాధ్యతగా సేవ చేయాలని, ఉన్నత చదువులు ఉన్నత ఉద్యోగాలు చేయాలని కోరారు. బంజారా జాతి వికసించడం శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ ఆశీస్సులతో శాంతి మార్గాలలో నడిచి సమాజానికి ఆదర్శంగా నిలవాలని సూచించారు.

## అంగన్వాడీ సిబ్బందిసంక్షేమానికి

# కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది

### రెండు సార్లు అంగన్వాడీ వేతనాలు పెంచిన ఘనత చంద్రబాబుదే

### అంగన్వాడీ కేంద్రాల మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి

### అంగన్వాడీలకు ప్రతి నెల ఒకటో తేదీనే వేతనాలు అందేలా చర్యలు

### ఏళ్ల తరబడి అంగన్వాడీలు ఎదురుచూసిన గ్రాట్యుటీ సమస్యను పరిష్కరించాం.హోం మంత్రి అనిత.



అమరావతి(ప్రశ్న న్యూస్) అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, చిరు ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని హోంమంత్రి అనిత తెలిపారు. గతంలో ఎన్నడూ లేని విధంగా చరిత్రలోనే తొలిసారిగా రెండు సార్లు అంగన్వాడీ వేతనాలు పెంచిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానికీ, ముఖ్యంగా సీఎం చంద్రబాబుకే దక్కుతుందని ఆమె పేర్కొన్నారు. ఎన్నికల్లో అంగన్వాడీలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడానికి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి స్పష్టం చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్వాడీ కేంద్రాల మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాల్లో తాగునీటి సౌకర్యాలు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ. 86.68 లక్షలు విడుదల చేసి, ఒక్కో కేంద్రానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. అంగన్వాడీలకు ప్రతి నెల ఒకటో తేదీననే వేతనాలు అందేలా చర్యలు తీసుకుని, జీతాల ఆలస్యానికి శాశ్వతంగా చెక్ పెట్టామని మంత్రి చెప్పారు. రాష్ట్రంలో 58,204 మంది అంగన్వాడీ వర్కర్లు, సూపర్‌వైజర్లు, బ్లాక్ కోఆర్డినేటర్లకు రూ. 75 కోట్ల వ్యయంతో 5+ స్మార్ట్‌ఫోన్లు అందజేసినట్లు తెలిపారు. ఈ స్మార్ట్‌ఫోన్ల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు మరింత వేగంగా, సమర్థవంతంగా సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక రంగాన్ని దెబ్బతీసి వెళ్లిందని ఆరోపించిన మంత్రి, వారు చేసిన అప్పులకు రాష్ట్రానికి వస్తున్న ఆదాయంతో పాటు మరిన్ని అప్పులు తెచ్చి వడ్డీలు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొన్నదని విమర్శించారు. అయినప్పటికీ ప్రతి నెల ఒకటో తేదీననే వేతనాలు చెల్లిస్తూ ఉద్యోగులకు భరోసాగా నిలుస్తున్నది కూటమి ప్రభుత్వమేనని హోంమంత్రి అనిత తెలిపారు.

# ఎరుకల కుటుంబానికి న్యాయం చేయాలి..

### రామాలయం పేరిట ఎరుకల కుటుంబాన్ని వెలి వేయడం అన్యాయం...



మంథని( ప్రశ్నా న్యూస్)పెద్దపల్లి జిల్లా ముత్తారం మండల కేంద్రంలో కేతిరి సారయ్య ఎల్లమ్మ కుటుంబం ఊరి బయట గత 40 సంవత్సరాలుగా నివాసం ఉంటున్నారు ఈ మధ్యకాలంలో కొంతమంది వ్యక్తులు రామాలయం నిర్మిస్తామని ఈ స్థలం నుండి వెళ్లిపోవాలని బెదిరింపులకు పాల్పడుతూ ఎరుకల కుటుంబం నివాసం ఉండే గుడిసెను కూలగొట్టే ప్రయత్నం చేస్తున్నారు ఈరోజు వ్యవసాయ కార్మిక సంఘం మహిళా కూలీల రాష్ట్ర కన్వీనర్ బొప్పని పద్మ, రాష్ట్ర కన్వీనర్ అంబాల శారద,రాష్ట్ర కమిటీ సభ్యురాలు లోకిని స్వరూప, మొగులోజు శారద తో పాటు పెద్దపల్లి జిల్లా ప్రజాసంఘాల నాయకులు ఆ కుటుంబం నివసిస్తున్న స్థలాన్ని పరిశీలించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 40 సంవత్సరాల క్రితం అప్పటి గ్రామ సర్పంచ్ వెంకట్రావు ఎరుకల కుటుంబానికి ఊరి బయట తన సొంత పనికి రాని నాలుగు గుంటల భూమిని నివాసం ఉండడానికి ఇవ్వడం జరిగింది అప్పటినుండి నిరుపేద ఎరుకల కుటుంబం గుడిసె ఏర్పాటు చేసుకొని పందులను కాచుకుంటూ జీవనోపాధిని పొందుతున్నారని అన్నారు ఈ మధ్యకాలంలో రామాలయం పేరిట గుడి కడతామని కొందరు వ్యక్తులు ఎరుకల కుటుంబం గుడి పక్కన ఉండవద్దనే ఉద్దేశంతోఎరుకల కుటుంబానికి చెందిన చిన్న జాతి వారు ఆ స్థలాన్ని విడిచి వెళ్లాలని ఇబ్బందులు పెడుతున్నారు గతంలో ఎవరు లేని సమయంలో గుడిసెను తగలబెట్టరని ఆ గుడిసెలో 30 పందులు సజీవజీవ దహనం అయ్యాయని ఇప్పటివరకు ఈ సంఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోలేదని వారి కుటుంబానికి ప్రభుత్వ పరంగా ఎలాంటి సహాయం లేదన్నారు కొందరు గ్రామ పెత్తందారులు కలిసి ఆ కుటుంబాన్ని గ్రామం నుండి వెలివేయాలనే ఉద్దేశంతో రాముని గుడి పేరిట గుడి పక్కకు ఎరుకల కుటుంబం నివాసం ఉండవద్దని చిన్న చూపుతో వివక్షపూరితంగా వీరి కుటుంబాన్ని ఎల్లగొట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు కావున సంబంధిత రెవెన్యూ శాఖ అధికారులు వెంటనే స్పందించి ఎరుకల కుటుంబాన్ని గ్రామం నుండి వెలివేయడానికి ప్రయత్నాలు చేస్తున్న గ్రామ పెత్తందారులపై తగు చర్యలు తీసుకొని వారికి దానం ఇచ్చిన స్థలంలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలని ఆ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో అన్ని ప్రజాసంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని ఎస్సీ,ఎస్టీ కమిషన్ కు ఫిర్యాదు చేస్తామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బూడిద గణేష్ డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొరటట్రంకల సురేష్, కేపీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మంథని లింగయ్య ఉన్నారు

# గౌడ - రజక సంఘాల ఆధ్వర్యంలో కౌన్సిలర్

### ఏనుగు జ్యోతి - తిరుపతి రెడ్డి దంపతులకు ఘన సన్మానం - శుభాకాంక్షలు

- వార్డు ప్రజల ఆశయాలను సంపూర్ణంగా నెరవేర్చే దిశగా కృష్జి చేస్తా
- 2 వ వార్డు కౌన్సిలర్ : ఏనుగు జ్యోతి - తిరుపతి రెడ్డి



వేములవాడ (ప్రశ్న న్యూస్) రాజన్న సిరిసిల్ల జిల్లా,వేములవాడ మున్సిపాలిటీలో విలీనమైన శాత్రాజుపల్లి గ్రామం 2వ వార్డు కౌన్సిలర్‌గా ఎన్నికైన ఏనుగు జ్యోతి – తిరుపతి రెడ్డిలకు గౌడ సంఘం, రజక సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ సంఘం అధ్యక్షులు,రజకసంఘం అధ్యక్షులు,కార్యవర్గ సభ్యులు శాలువాలతో పూలమాలలతో ఆమెను ఘనంగా సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. సన్మానానికి స్పందించిన ఏనుగు జ్యోతి – తిరుపతి రెడ్డి దంపతులు మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి గెలిపించిన వార్డు ప్రజలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. శాత్రాజుపల్లి 2వ వార్డులో డ్రైనేజీ వ్యవస్థ, సీసీ రోడ్లు, మంచినీటి సరఫరా వంటి మౌళిక సదుపాయాల మెరుగుదలకు ప్రాధాన్యత ఇస్తానని హామీ ఇచ్చారు. ప్రజల సహకారంతో వార్డును అభివృద్ధి పథంలో నడిపిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం, రజక సంఘం ప్రతినిధులు,వార్డు ప్రముఖులు పాల్గొన్నారు.

# పెళ్లిపై స్పందించిన త్రిష..

## నచ్చిన వ్యక్తి దొరికినప్పుడేనంటూ ఆసక్తికర వ్యాఖ్యలు



దక్షిణాది సినీ పరిశ్రమలో రెండు దశాబ్దాలుగా అగ్ర కథానాయికగా వెలుగొందుతున్న త్రిష కృష్ణన్ మరోసారి తన వ్యక్తిగత జీవితం గురించి చేసిన వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచారు. నటనతో పాటు తన వ్యక్తిత్వంతోనూ ప్రత్యేక గుర్తింపు పొందిన త్రిష పెళ్లి, విడాకులు, సహజీవనం వంటి అంశాలపై గతంలో వెల్లడించిన అభిప్రాయాలు తాజాగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఒక ఇంటర్వ్యూలో "మీ పెళ్లి ఎప్పుడు?" అనే ప్రశ్నకు త్రిష స్పష్టమైన సమాధానం ఇచ్చారు. "చాలామంది నన్ను పెళ్లి గురించి అడుగుతుంటారు. కానీ నాకు ఒకటే సమాధానం ఉంది. నాకు నచ్చిన, సరైన వ్యక్తి దొరికితేనే నేను పెళ్లి చేసుకుంటాను. ఒకవేళ అలాంటి వ్యక్తి దొరకకపోతే పెళ్లి జరగకపోయినా నాకు ఎలాంటి అభ్యంతరం లేదు," అని ఆమె తెలిపారు. త్రిష వ్యాఖ్యల్లో స్పష్టత, ఆత్మవిశ్వాసం కనిపించాయి. పెళ్లి అనేది కేవలం సమాజం కోసం తీసుకునే నిర్ణయం కాదని, జీవితాంతం కలిసి జీవించగలమనే నమ్మకం కలిగినప్పుడే ఆ అడుగు వేయాలని ఆమె అభిప్రాయపడ్డారు. "నేను పెళ్లి చేసుకుంటే అది విడాకుల వరకు వెళ్లకూడదని భావిస్తున్నాను. అందుకే తొందరపడి ఎలాంటి తప్పుడు నిర్ణయం తీసుకోను," అని త్రిష వివరించారు. తన స్నేహితుల్లో చాలామంది ఇష్టం లేని పెళ్లిళ్లు చేసుకుని బాధపడుతున్నారని, అలాంటి జీవితం తనకు వద్దని ఆమె స్పష్టం చేశారు.ఇష్టం లేని వ్యక్తితో కలిసి నరకం అనుభవించడం కంటే ఒంటరిగా ఉండటం మేలని త్రిష అభిప్రాయపడ్డారు. ప్రేమలో పడటం కంటే తన జీవితాన్ని పంచుకోగలిగే మంచి భాగస్వామి కావాలని, తనకు నచ్చిన వ్యక్తితో సంతోషంగా జీవించడమే తన లక్ష్యమని తెలిపారు. త్రిష చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం నెట్టింట చర్చనీయాంశంగా మారాయి. ఆమె అభిప్రాయాలకు కొందరు మద్దతు తెలుపుతుండగా, మరికొందరు వివిధ కోణాల్లో స్పందిస్తున్నారు. అయితే పెళ్లి విషయంలో సమాజపు ఒత్తిడికి లోనుకాకుండా, తన నిర్ణయాన్ని తాను తీసుకోవాలనే సందేశాన్ని త్రిష స్పష్టంగా ఇచ్చారని అభిమానులు అభిప్రాయపడుతున్నారు.ఇదిలా ఉంటే, త్రిష ప్రస్తుతం పలు ఆసక్తికర ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. కెరీర్ పరంగా వరుస అవకాశాలతో దూసుకుపోతూనే, వ్యక్తిగత జీవితం విషయంలో మాత్రం ఆచితూచి అడుగులు వేస్తున్నారని చెప్పాలి. కాగా, ఈ మధ్య విజయ్ డైవర్స్ ఇష్యూలో త్రిష పేరు బయటకు రావడం హాట్ టాపిక్ అయిన విషయం విదితమే.

# ధనుష్ 'కారా' రిలీజ్ డేట్ ఫిక్స్..

# సమ్మర్ బరిలో దిగుతున్న కరసామి!



తమిళ స్టార్ నటుడు ధనుష్, 'పోర్ తోజిల్' ఫేమ్ విఘ్నేష్ రాజా కాంబినేషన్‌లో వస్తున్న క్రేజీ ప్రాజెక్ట్ 'కారా' (ఖుతీఖు) విడుదల తేదీ ఎట్టకేలకు ఖరారైంది. భారీ యాక్షన్ ఎంటర్టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రాన్ని ఏప్రిల్ 30, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. వేల్స్ యూనివర్సిటీలో జరిగిన 'వేల్స్ నక్షత్ర 2026' వేడుకల్లో నిర్మాత ఐషారి కె. గణేష్ ఈ విషయాన్ని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ధనుష్‌తో 'వడ చెన్నై 2' చేయడం తన డ్రీమ్ ప్రాజెక్ట్ అని, ప్రస్తుతానికి 'కారా' సినిమాను ఏప్రిల్ 30న ప్రేక్షకుల వ ం ం ం ద ం క ం తీసుకురావడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ సినిమాలో ధనుష్ 'కరసామి' అనే పత్తి రైతు పాత్రలో కనిపించబోతున్నాడు. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ ఎమోషనల్ సస్పెన్స్ థ్రిల్లర్‌లో ధనుష్ లుక్ చాలా ఇంటెన్సివ్‌గా ఉండబోతోంది. మలయాళ బ్యూటీ మమితా బైజు హీరోయిన్‌గా నటిస్తుండగా.. జయరామ్, కె.ఎస్. రవికుమార్, సూరజ్ వెంజారమూడు, కరుణాస్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత జి.వి. ప్రకాష్ కుమార్ ఈ సినిమాకు సంగీతం అందిస్తుండగా, తేని ఈశ్వర్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు చేపడుతున్నారు. గతంలో 'పోర్ తోజిల్' వంటి సూపర్ హిట్ థ్రిల్లర్‌ను అందించిన విఘ్నేష్ రాజా -- ఆల్ఫ్రెడ్ ప్రకాష్ ద్వయం ఈ చిత్రానికి కథను అందించారు.

# అమ్మ సంతోషమే ముఖ్యం ..

## సురేఖ వాణి రెండో పెళ్లిపై సుప్రీత భావోద్వేగ వ్యాఖ్యలు



టాలీవుడ్ నటి సురేఖా వాణి ఆమె కూతురు సుప్రిత నాయుడు మధ్య ఉన్న అనుబంధం గురించి తెలుగు ప్రేక్షకులకు ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఈ తల్లీకూతుళ్లు స్నేహితుల్లా కలిసి ఉండటం, సోషల్ మీడియాలో తరచూ ఫొటోలు, వీడియోలు షేర్ చేస్తూ సందడి చేయడం తెలిసిందే. వారి ఆప్యాయత, ఓపెన్ బాండింగ్ ఎప్పుడూ చర్చనీయాంశం అవుతుంది. ఇటీవల సుప్రీత తన తల్లి భవిష్యత్తు గురించి చేసిన వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి. భర్త మరణం తర్వాత సురేఖ వాణి ఎన్నో కష్టాలు ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. ఆ సమయంలో ఆమెకు కూతురు సుప్రీత ప్రధాన ఆధారం అయింది. ఇప్పుడు అదే కూతురు తన తల్లి జీవితంపై తీసుకున్న నిర్ణయం అందరినీ ఆకట్టుకుంటోంది. నేను పెళ్లి చేసుకునే ముందు, నా అమ్మకు జీవితంలో ఒక మంచి తోడు ఉండాలి. ఆమెను ప్రేమగా చూసుకునే, గౌరవించే వ్యక్తి రావాలి అని సుప్రీత వెల్లడించింది. ఈ విషయాన్ని తాను కుటుంబ సభ్యులతో కూడా చర్చించానని, వారు కూడా తన అభిప్రాయానికి మద్దతు తెలిపారని చెప్పింది. అయితే ఇది కేవలం తన కోరిక మాత్రమే కాదని ఆమె స్పష్టం చేసింది. "అమ్మ సంతోషమే నాకు ముఖ్యం. ఆమె ఏ నిర్ణయం తీసుకున్నా నేను గౌరవిస్తాను. నాన్న స్థానాన్ని మరెవరికి ఇవ్వాలని ఆమెకు ఇష్టం లేదు. ఆమెను బలవంతం చేయను. కానీ అమ్మ ఒంటరిగా ఉండకూడదని మాత్రమే నేను కోరుకుంటున్నాను" అంటూ ప్రేమతో చెప్పిన మాటలు సోషల్ మీడియాలో హృదయాలను తాకుతున్నాయి. ఇప్పటికీ వితంతువుల రెండో పెళ్లిపై సమాజంలో మిశ్రమ అభిప్రాయాలు ఉన్నప్పటికీ, తల్లి భవిష్యత్తు కోసం ముందుగా ఆలోచిస్తున్న సుప్రీత నిర్ణయాన్ని పలువురు అభినందిస్తున్నారు. తల్లికి మంచి జీవితం కావాలని కోరుకునే కూతురి మనసు నిజంగా ప్రశంసనీయమని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. తల్లీకూతుళ్ల మధ్య ఉన్న ఈ ఆప్యాయ బంధం మరోసారి అందరి దృష్టిని ఆకర్షించింది. కాగా, సుప్రీత ప్రస్తుతం టాలీవుడ్‌లో హీరోయిన్‌గా సత్తా చాటుతుంది.

# టాక్సిక్ నుంచి 'తబాహి'..

## కియారా-యశ్ కెమిస్ట్రీతో హీటెక్కుతున్న సోషల్ మీడియా



పాన్ ఇండియా స్టార్ నటుడు యశ్, బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ జంటగా నటిస్తున్న భారీ యాక్షన్ డ్రామా 'టాక్సిక్' నుంచి తాజాగా విడుదలైన పోస్టర్లు సోషల్ మీడియాను షేక్ చేస్తున్నాయి. గీతూ మోహన్ దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలోని మొదటి పాట 'తబాహి'కి సంబంధించి మేకర్స్ విడుదల చేసిన రొమాంటిక్ అప్‌డేట్స్ ఇప్పుడు ఫ్యాన్స్‌లో సెన్సేషన్ క్రియేట్ చేస్తున్నాయి. ఈ చిత్రంలోని ఫస్ట్ సింగిల్ 'తబాహి'ని మార్చి 2న మధ్యాహ్నం 12:59 గంటలకు విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. అయితే ఈ సందర్భంగా విడుదల చేసిన పోస్టర్‌లో యశ్ షర్ట్‌లెస్ లుక్‌లో కనిపిస్తుండగా, కియారా అద్వానీ ఆయనను బిగి కౌగిలిలో బంధించిన రొమాంటిక్ స్టిల్ ఇప్పుడు ఇంటర్నెట్‌ను ఊపేస్తోంది. సముద్రపు తీరంలో సూర్యాస్తమయ వేళ వీరిద్దరి కెమిస్ట్రీ పోస్టర్లలో పీక్స్‌లో కనిపిస్తోంది. ఈ సినిమాలో యశ్ 'రాయ' అనే శక్తివంతమైన పాత్రలో నటిస్తుండగా, కియారా అద్వానీ 'నదియా'గా కనిపించనుంది. వీరు కాకుండా నయనతార, హుమా ఖురేషి, తారా సుతారియా మరియు రుక్మిణి వసంత్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ చిత్రం 1940 -- 70ల మధ్య గోవా బ్యాక్‌డ్రాప్‌లో సాగే గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్నట్లు సమాచారం.

# మల్లేశ్.. ఓ పెద్ద కథ

శ్రీనాథ్ మాగంటి హీరోగా నటిస్తూ దర్శకత్వం వహించిన చిత్రం 'మాన్షన్‌హౌస్ మల్లేష్'. గాయత్రి రమణ, సాయిమీనాక్షి భాస్కర్ల కథానాయికలు. రాజేష్ నిర్మాత. ఈ నెల 6న సినిమా విడుదలకానుంది. ప్రచార చిత్రాలకు ఇప్పటికే మంచి స్పందన వస్తున్నదని మేకర్స్ ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్‌ని లాంచ్ చేశారు. అగ్ర దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా ఈ ట్రైలర్‌ని లాంచ్ చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. 'అదొక పెద్ద కథ' అంటూ మురళీధర్‌గౌడ్ చెప్పడంతో ఈ ట్రైలర్ మొదలైంది. హీరో మల్లేష్ క్యారెక్టరైజేషన్, పెళ్లి చూపులు, తర్వాత జరిగిన సంఘటనలు.. ఇవన్నీ వినోదాన్ని పంచాయి. మల్లేష్ పాత్రలో శ్రీనాథ్ ఒదిగిపోయారని, మిగతా పాత్రలు కూడా ఆసక్తికరంగా సాగాయని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: అమ్మముత్తు, సంగీతం: సురేష్ బొబ్బిలి.



## పక్కా పల్లెటూరి మాస్ అండ్ ఫన్నీ ఎంటర్టైనర్..

# 'మెన్షన్ హౌస్ మల్లేష్' ట్రైలర్ విడుదల

టాలీవుడ్ యువ నటుడు శ్రీనాథ్ మాగంటి హీరోగా, గాయత్రి రమణ మరియు సాయి కామాక్షి భాస్కర్ల హీరోయిన్లుగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'మెన్షన్ హౌస్ మల్లేష్'. ఈ సినిమా మార్చి 06న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా చిత్రబృందం ట్రైలర్‌ను స్టార్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగాతో లాంచ్ చేయించింది. 'యానిమల్' సినిమాలో రష్మిక మందన్నకు సోదరుడిగా మెప్పించిన శ్రీనాథ్ మాగంటి, ఈ చిత్రంలో 'మల్లేష్' అనే రఫ్ అండ్ మాస్ క్యారెక్టర్‌లో అదరగొడుతున్నారు. తెలంగాణ గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో శోభనం రాత్రి పెళ్ళికూతురు ఇచ్చే ఒక షాకింగ్ ట్విస్ట్ వల్ల హీరో జీవితం, అతని వ్యక్తిగత రహస్యం ఊరంతా ఎలా చర్చనీయాంశంగా మారాయనేది దర్శకుడు బాల సతీష్ చాలా ఫన్నీగా, ఎమోషనల్ గా చూపించారు. సురేష్ బొబ్బిలి అందించిన సంగీతంలో "బంగారి.. బంగారి.." పాట ఇప్పటికే చార్ట్ బస్టర్‌గా నిలవగా, ట్రైలర్ సినిమాపై భారీ అంచనాలను పెంచింది. కనకమేడల ప్రొడక్షన్స్ బ్యానర్‌పై రాజేష్ నిర్మించిన ఈ చిత్ర ట్రైలర్ లాంచ్ వేడుకకు విశ్వక్ సేన్, తరుణ్ భాస్కర్ వంటి ప్రముఖులు హాజరై చిత్ర యూనిట్‌కు ఆల్ ది బెస్ట్ తెలిపారు.




# యువ ప్రేమకథ మొదలు

హన్సి ప్రొడక్షన్స్ పతాకంపై ఓ యువతరం ప్రేమకథ రూపొందుతున్నది. జగన్ యోగిరాజు, నవ్య చిట్యాల జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి రఘువర్ధన్ కోట్ల దర్శకుడు. శ్రీహన్సిక పెద్దిరెడ్డి నిర్మాత. శనివారం హైదరాబాద్‌లో ఈ సినిమా ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. మహూర్తపు సన్నివేశానికి శ్రీధర్ పెద్దిరెడ్డి క్లాప్ ఇవ్వగా, స్రవంతి పెద్దిరెడ్డి కెమెరా స్విచాన్ చేశారు. శ్రీహన్సిక పెద్దిరెడ్డి స్క్రిప్ట్‌ని దర్శకుడికి అందించారు. 'సినిమా నిర్మించడం నా కల. అభిరుచితో బాధ్యతగా అన్నింటికంటే ముఖ్యంగా ప్రేమతో ఈ సినిమాను నిర్మిస్తున్నాను. నిర్మాతగా నా తొలి సినిమా ఓ అందమైన ప్రేమకథ కావడం ఆనందంగా ఉంది. అందరూ ఆస్వాదించేలా సినిమా నిర్మిస్తాం' అని నిర్మాత శ్రీహన్సిక పెద్దిరెడ్డి నమ్మకంగా చెప్పారు. త్వరలోనే రెగ్యులర్ షూటింగ్ మొదలుకానున్న ఈ చిత్రంలో దేవీప్రసాద్, లక్ష్మణ్ మీసాల, సునందిని ఇతర పాత్రధారులు ఈ చిత్రానికి కెమెరా: సాయివంశీ దాచపల్లి, సంగీతం: రాజీవ్‌రాజ్, సహనిర్మాత: తవిటిరాజు తలచింతల.



## జిల్లా పరిధిలో పోలీస్ యాక్ట్ అమలు: ఎస్పీ మహేష్ బి.గితే



సిరిసిల్ల (ప్రశ్న న్యూస్) శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని పోలీస్ యాక్ట్ 1861 ప్రకారం నెల రోజుల మార్చ్ 1వ తేది నుండి 31 వరకు పాటు జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ అమలులో ఉంటుందని జిల్లా ఎస్పీ తెలిపారు. దీని ప్రకారం పోలీసు అధికారుల అనుమతి లేకుండా ఎలాంటి ధర్నాలు, రాస్తా రోకోలు, నిరసనలు, ర్యాలిలు, పబ్లిక్ మీటింగ్ లు, సభలు, సమావేశాలు నిర్వహించరదాని, నిబంధనలకు విరుద్దిదంగా డి.జే వినియోగించారాదని తెలిపారు. శాతిభద్రతలకు భంగం కలిగించే విధంగా, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కల్గించే చట్ట వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టరాదని సూచించారు. కాబట్టి జిల్లా ప్రజలు పోలీసు వారికి ఇట్టి విషయంలో సహకరించాలని శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం శ్రమిస్తున్న పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకారం అందించాలని కోరారు.

## కోడె మృతితో కంటనీరు పెట్టుకున్న కాలనీవాసులు



ఎల్లారెడ్డిపేట (ప్రశ్న న్యూస్) వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించిన తిప్పాపూర్ గోశాలలో రైతులకు కోడల పంపిణీ సందర్భంగా రైతు దుర్గం విజయ్ బాబుకు రెండు కోడెలను పంపిణీ చేశారు. అనారోగ్యంతో ఉన్న కోడలను పశు వైద్యుల సూచనల మేరకు వైద్యం చేయించి పెంచుకుంటూ ఉండగా మంచి ఆరోగ్యంగా అయినా కోడెలలో నుండి ఒక కోడె ఆకస్మాత్తుగా అనారోగ్యానికి గురికావడంతో పశు వైద్యులను సంప్రదించి వైద్యం చేయించిన మృతి చెందింది. పాముకాటుతో మృతి చెందని రైతులు తెలిపారు. ప్రేమగా పెంచుకున్న కోడె మృతి చెందడంతో రైతు విజయ్ బాబు కుటుంబకులు కన్నీరు మునీరుగా విలపించారు. రైతు నర్మద విజయ్ బాబు కూతురు చిన్నారి చరితకు కోడెకు స్నేహం ఉండడంతో మృత్యువాత పడ్డ కోడెని చూసి ఏడవడంతో కాలనీవాసులందరూ కంటనీరు పెట్టారు. రైతులకు పశువులకు విడదీయరాని అనుబంధం ఉంటుందని ఈ ఘటన రుజువు చేసింది.

## పొన్న వాహనంపై నరసింహుడు



మంగళగిరి(ప్రశ్న న్యూస్) శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదవ రోజైన ఆదివారం రాత్రి స్వామివారు పొన్న వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత అర్చక స్వాములు స్వామివారి ఉత్సవ మూర్తులను వాహనంపై అధిష్టింప చేసి రంగు రంగు పూలమాలు, విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆ విద్యుత్ కాంతుల మధ్య పెండ్లి కుమారుడైన నరసింహుడు దేదీప్యమనంగా వెలుగొందుతూ భక్తులకు దర్శనం ఇచ్చారు. దేవస్థానం ప్రధాన అర్చకులు మాల్యవంతం శ్రీనివాస దీక్షితులు, అర్చక బృందం పూజలు నిర్వహించారు. ఉత్సవ విశిష్టతను శ్రీనివాస దీక్షితులు వివరించారు. ఉత్సవంలో చూపించే గోపికలు అందరూ కలిసి స్నానంకు వెళ్లడం, భక్తులు పరస్పరము ఆధ్యాత్మికంగా సహకరించుకుంటూ ఒకరికొకరు చేయూతనిచ్చుకొనుచు నడిచిపోవాలని తెలియజేస్తుందన్నారు. స్వామి గోపికల వస్త్రములను అపహరించారన్నారు. స్వామి గోపికల వస్త్రములను అపహరించి వారిలో ఉన్న దేహాభిమానాన్ని తొలగించి, విముక్తిని ప్రసాదించారన్నారు. స్వామి అపహరించినది వస్త్రములను కాదని, వాసనలు అపహరించారన్నారు. పాంచభౌతిక శరీరంపై వ్యామోహం ఉన్నంత వరకు, ముక్తి దుస్సాధ్యమని, పొన్న వాహనోత్సవం ద్వారా స్వామి భక్తులకు బోధిస్తున్నారన్నారు. వాహనోత్సవములో స్వామిని దర్శించిన వారికి దేహాభిమానం తొలగి స్వామి కృపకు పాత్రులు అవుతారన్నారు. పొన్న వాహనోత్సవంకు ప్రత్యేకత ఉండటంతో పట్టణ పరిసర ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామివార్లను దర్శించుకున్నారు. దీంతో దేవస్థానం ప్రాంతం భక్తులతో కిక్కిరిసి పోయింది. దేవస్థాన సహాయ కమిషనర్ అండ్ కార్యనిర్వాహణాధికారి కోగంటి సునీల్ కుమార్, ధర్మకర్తల మండలి పర్యవేక్షించారు.

## కౌన్సిలర్‌కు శుభాకాంక్షలు తెలిపిన మాజీ వార్డు సభ్యుడు గడ్డం నవీన్




**మేడ్చల్( ప్రశ్న న్యూస్)** ఎల్లంపేట పురపాలక సంఘం పరిధిలోని 22వ వార్డు కౌన్సిలర్ గా విజయం సాధించిన సద్ది నిషిత రెడ్డికి కోనాయిపల్లి గ్రామ మాజీ వార్డు సభ్యుడు గడ్డం నవీన్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సన్మానించిన అనంతరం పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వార్డు సభ్యుడు గడ్డం నవీన్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి కౌన్సిలర్ సద్ది నిషిత రెడ్డి స్థానిక వార్డు నాయకులతో కలిసి ఉండి ప్రజల సమస్యలను పరిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ గుంటి శేఖర్ ముదిరాజ్, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గుంటి కుమార్ ముదిరాజ్, గుంటి దీపక్ ముదిరాజ్, గుంటి శ్రీకాంత్ ముదిరాజ్, అన్నారం భాస్కర్, గడ్డం అనిల్, గుంటి జీవన్ లతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

### బాణా సంచా పేలుళ్ల క్షతగాత్రులను పరామర్శించిన

# సీపీఐ రాష్ట్ర నేతల బృందం

- మృతుల కుటుంబాలకు కారుణ్య తరహా నియామక ఉద్యోగాలు ఇవ్వాలి - రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి
- ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే వరుసవారీ ఘటనలు - బాధ్యులైన ఉన్నతాధికారులపై కఠిన చర్యలు
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ - కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో క్షతగాత్రులకు పార్టీ నేతలతో కలిసి పరామర్శ



**కాకినాడ(ప్రశ్న న్యూస్)** కాకినాడ బాణా సంచా పేలుళ్ల ఘటనకు ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని, వరుస వారీగా ఈ తరహా సంఘటనలు కొనసాగుతున్నప్పటికీ ప్రభుత్వ యంత్రాంగం శాశ్వత పరిష్కారానికి కృషి చేయడంలేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. కాకినాడ బాణాసంచా పేలుళ్ల ఘటనలో అత్యధిక దళిత, రోజు వారీ కూలీలు, బాధిత కుటుంబాలకు కారుణ్య తరహా నియామకాలుగా గుర్తించి ఉద్యోగాలు కల్పించాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కాకినాడజిల్లా సామర్లకోట మండలం వేట్లపాలం బాణసంచాల పేలుడు ఘటనలోని తీవ్ర గాయాలపాలైన క్షతగాత్రుల్ని అక్కడి కొత్త ప్రభుత్వాస్పత్రులో చికిత్స పొందుతున్నారు. మరికొందరు ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రభుత్వాస్పతిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యులు అక్కినేని వనజ, రాష్ట్రకార్యదర్శివర్గ సభ్యులు తాటిపాక మధు, జిల్లా నేతలతో కలిసి ఈశ్వరయ్య పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై ఆందోళన వ్యక్తం చేశారు. వైద్య సేవలపై ఆరా తీశారు. అనంతరం ఈశ్వరయ్య మాట్లాడుతూ బాణా సంచా పేలుళ్ల ఘటనలో ఇప్పటివరకు 21 మరణాలు చేరాయని తెలిపారు. కాకినాడ కొత్త ప్రభుత్వాస్పత్రిలో 8 మంది మ త్యువుతో పోరాడుతున్నారని, వారి శరీరంలోని ప్రధాన భాగాలు సైతం 90 శాతం కాలిపోయాయని వివరించారు. ప్రధానంగా క్షతగాత్రుల్లోని ఆడ, మగ వారికి ముఖ్యమైన విభాగాలు పూర్తిగా కాలిపోయాయని, జుట్టు లేకుండా పోయిందని, కళ్లు కాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. చనిపోయిన వారితోపాటు ప్రస్తుతం క్షతగాత్రులుగా ఉన్న వారిలో అత్యధికం దళిత, పేద, రోజు వారీ కూలి పనులు చేసుకుంటున్న వారేనని చెప్పారు. వాళ్ల కుటుంబీకులు, పిల్లలు నడిరోడ్డున పడ్డారని తెలిపారు. చంద్రబాబు ప్రభుత్వం తక్షణమే స్పందిచి బాధిత మ తుల కుటుంబాలకు రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. గతేడాది నుంచి ప్రస్తుతం వరకు వరుస వారీగా బాణా సంచా పేలుళ్ల సంఘటనలు జరుగుతున్నప్పటికీ..ప్రభుత్వంలో ఏ మాత్రం కదలిక లేదని, సంబంధిత శాఖాధికారులు మొద్దు నిద్రలో ఉన్నారని తెలిపారు. గతంలోనే కఠినమైన చర్యలు తీసుకుంటే..నేడు ఈ తరహాగా ఘోర సంఘటనలు జరిగేవి కాదన్నారు. గతేడాది ఏలూరు, అనకాపల్లి, తిరుపతి, కడప తదితర ప్రాంతాల్లో ఇదే తరహా ఘటనలు జరగడం, భారీగా మరణాలు చోటు చేసుకున్నాయని గుర్తుచేశారు. మొత్తంగా ఈ రెండేళ్లల్లో బాణా సంచా పేలుళ్ల ఘటనలతో మరణాలు కొనసాగుతున్నప్పటికీ, ఎక్కడా పర్యవేక్షణ లేకుండా పోయిందని తెలిపారు. బాణా సంచా తయారీకి ఉపయోగించే మందును అధికంగా వాడటం, వాటిని నిర్వాహకులు విచ్చలవిడిగా వదిలేయడంతోనే ఈ తరహా ఘటనలు పునరావ తమవుతున్నాయని చెప్పారు. ఈ ఘటనలో 21 మంది చనిపోవడం, మరో 8 మంది మ త్యువుతో పోరాడుతున్న పరిస్థితి చూస్తే..ఇది చాలా ఘోర ఘటన అని, దీన్ని ప్రభుత్వం సీరియస్‌గా ద ష్టి పెట్టాలన్నారు. కేవలం కింది స్థాయి అధికారులపై చర్యలు చేపట్టి..ఉన్నతాధికారులను వదిలేయడం సరికాదని, దీనికి అనుమతులిచ్చిన జిల్లా కలెక్టర్, ఎస్పీపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలకు రూ.50లక్షలు ప్రభుత్వం సత్వరమే విడుదల చేయాలని, మ తుల కుటుంబాలకు కారుణ్య తరహా ఉద్యోగాల్ని ప్రభుత్వం కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ పర్యటనలో సీపీఐ కాకినాడ జిల్లా కార్యదర్శి కె.బోడకొండ, జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు పి.సత్యనారాయణ, సాకా రామక ష్ణ, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి వై.బాబీ, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ భవానీ, ఏఐటీయూసీ నాయకులు రామయ్య అనిల్ బాలకృష్ణ ఏఐ ఎస్ ఫ్ నాని సీపీఐ నాయకులు కొమర్తి శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు

## అమరావతిలో నేషనల్ జ్యుడిషియల్ అకాడమీ ఏర్పాటు చేయండి

- దేశంలోనే బెస్ట్ మోడల్‌గా రాజధానిలో జస్టిస్ సిటీ నిర్మాణం
- మధ్యవర్తిత్వంతోనే సత్వర న్యాయం కేసుల పరిష్కారం
- మధ్యవర్తిత్వంపై రాష్ట్రస్థాయి సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు



**విజయవాడ (ప్రశ్న న్యూస్)** అమరావతిలో నేషనల్ జ్యుడిషియల్ అకాడమీని ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భారత దేశ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను కోరారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ నేతృత్వంలో ఆదివారం విజయవాడలో మధ్యవర్తిత్వంపై రాష్ట్రస్థాయి సదస్సు జరిగింది. ఈ సదస్సుకు సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ హాజరయ్యారు. సదస్సుకు వచ్చిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్‌కు సీఎం చంద్రబాబు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాజధాని నిర్మాణంలో జస్టిస్ సిటీలో న్యాయ వ్యవస్థకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. జ్యుడిషియల్ అకాడమీ, లీగల్ సర్వీసెస్ అథార్టీ, మీడియేషన్ సెంటర్, ఇంటర్నేషనల్ లా యూనివర్శిటీ, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా వంటి వాటిని ఇంటిగ్రేట్ చేస్తూ బెస్ట్ జ్యుడిషియల్ సిటీని నిర్మిస్తాం. వీటికి అవసరమైన భూములు ఇవ్వడానికి కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అమరావతిలో నేషనల్ జ్యుడిషియల్ అకాడమీ ఏర్పాటు చేయాలని కోరుతున్నాం... ఈ అకాడమీ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తాం. అమరావతిలోని జస్టిస్ సిటీని దేశంలోనే బెస్ట్ మోడల్‌గా తీర్చిదిద్దేందుకు మేం ప్రయత్నిస్తున్నాం... దీనికి సీజేఐ సహకారం కావాలి. గ్రామాల్లో మధ్యవర్తిత్వం ద్వారా చాలా సమస్యలను పరిష్కరించేవారు మా తండ్రి కూడా పెద్దరికం వహించి గ్రామంలో సమస్యలను పరిష్కరించారు. మధ్యవర్తిత్వంతో కేసులను పరిష్కరిస్తే రూ.10 వేలు ఇస్తాం కేసులు పరిష్కారం కాకున్నా రూ. 3 వేలు ఇస్తాం. కేసులు పరిష్కారమై సత్వర న్యాయం అందితే త్వరితగతిన అభివృద్ధి సాధ్యమవుతుంది. ఈ క్రమంలో మధ్యవర్తిత్వంతో పరిష్కారమైన కేసులకు రూ.10 వేలు ఇవ్వడం పెద్ద కష్టం కాదు. దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకంగా రాజధాని అమరావతి నిర్మాణం చేపడుతున్నాం. బ్లూ-గ్రీన్ ఫీల్డ్ రాజధానిగా అభివృద్ధి చేస్తున్నాం. ల్యాండ్ పూలింగ్ ద్వారా 29,000 మందికి పైగా రైతులు స్వచ్ఛందంగా రాజధానికి భూములు ఇచ్చారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా, పర్యావరణ హితంగా, ఆర్థికంగా బలమైన రాజధాని ఉండేలా అమరావతిని తీర్చిదిద్దుతున్నాం. వికసిత్ భారత్ -2047 లక్ష్యాలకు అనుగుణంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నాం" అని ముఖ్యమంత్రి వివరించారు. ఈ కార్యక్రమానికి సుప్రీం కోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, అడ్వకేట్లు తదితరులు హాజరయ్యారు.

### సమాజంలో ఆర్ఎస్ఎస్ చేస్తున్న

## సేవలు అభినందనీయం

- దేశభక్తి, సేవాభావం, వ్యక్తిత్వ వికాసం వంటి మహత్తర లక్ష్యాలతో ఆర్ఎస్ఎస్
- ఇందూరు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ వెల్లడి



**నిజామాబాద్(ప్రశ్న న్యూస్)** దేశభక్తి, సేవాభావం, వ్యక్తిత్వ వికాసం వంటి మహత్తర లక్ష్యాలతో సమాజంలో సంఘ్ చేస్తున్న సేవలను అభినందించారు. ఇందూరులోని గిరిరాజ్ కాలేజ్ మైదానం, దుబ్బా ప్రాంతంలో నిర్వహించిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ నగర శాఖల సంగమం కార్యక్రమానికి ఇందూరు అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. 1925 విజయదశమి పర్వదినాన స్థాపించబడిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్దోత్సవ వేడుకల సందర్భంగా నగరంలోని అన్ని శాఖలను ఒకే వేదికపై సమీకరించి ఈ సంగమ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సమాజంలో ఐక్యత, సోదరభావం, శిస్తు, సేవాస్ఫూర్తి పెంపొందించడంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ పాత్ర విశేషమని పేర్కొన్నారు. యువత దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వక్త శ్రీ కల్లూరి ప్రభు కుమార్ ప్రసంగించి సంఘ్ సిద్ధాంతాలు, శతాబ్ద ప్రయాణం, భవిష్యత్ కార్యాచరణపై వివరణ ఇచ్చారు.అనంతరం మాట్లాడుతూ ఈ రోజు కార్యక్రమంలో 50 బస్తీల శాఖలు పాల్గొన్నాయని ఇందూరు నగరంలో ఆర్ఎస్ఎస్ శాఖ ప్రారంభమై 75 సంవత్సరాలు పూర్తి చేసుకున్న శుభ సందర్భంగా వచ్చే సంవత్సరం జరిగే ఈ కార్యక్రమంలో 75 బస్తీల నుండి శాఖలు పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు. నగరంలోని స్వయంసేవకులు, ప్రముఖులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

### ఘనంగా మాదిగ అమరవీరుల

## సంస్మరణ దినోత్సవం

- ఉప్పల్ నియోజకవర్గం నాచారం కేంద్రంలో భావోద్వేగ వాతావరణం
- నాచారం కేంద్రంలో నివాళులర్పణ, సమాన హక్కుల సాధనకు పిలుపు



**నాచారం (ప్రశ్న న్యూస్)** మార్చి 1న మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఉప్పల్ నియోజకవర్గం నాచారం కేంద్రంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి, దీపప్రజ్వలన చేసి, రెండు నిమిషాల మౌనం పాటిస్తూ నివాళులు అర్పించారు. కార్యక్రమం అంతటా గౌరవప్రదమైన, భావోద్వేగ వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు కేశపాగ రాంచందర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు పంగ ప్రణయ్ కుమార్ మాదిగ, ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జ్ కోరపాక అంజి మాదిగ, జై భీం వ్యవస్థాపకులు నల్ల బాబు, ఎంజెఫ్ రాష్ట్ర నాయకులు మనోహర్, సీనియర్ జర్నలిస్టు ఎల్ల సంతోష్, గజ్జెల రాంచందర్, శివ తదితరులు పాల్గొన్నారు.నాయకులు మాట్లాడుతూ, మాదిగ అమరవీరుల త్యాగాలు సామాజిక న్యాయం కోసం జరిగిన మహత్తర పోరాటానికి ప్రతీకలని అన్నారు. వారి ఆశయాల సాధన కోసం ఐక్యంగా కృషి చేయాల్సిన అవసరం ఉందని, సమాన హక్కులు, గౌరవం, న్యాయం కోసం పోరాటం కొనసాగించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు.పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, స్థానికులు హాజరై అమరవీరుల త్యాగాలకు కృతజ్ఞతలు తెలియజేసి, వారి మార్గంలో నడవాలని ప్రతిజ్ఞ చేశారు.

# హైకోర్టు స్టేటస్‌కోను బేఖాతరు చేశారా.?

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కావాలని తీసుకువచ్చిన మాజీ కార్పొరేటర్, - సికింద్రాబాద్ కన్యకా పరమేశ్వరి దేవాలయం వివాదం రగులుతోంది
- మూడు ఇల్లీగల్ కమిటీలకు సహకరిస్తున్న ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణ. - కన్యకా పరమేశ్వరి దేవాలయం పేరుతో భారీగా నిధులతోపిడి
- హైకోర్టులో కంటెంట్ పిటిషన్ ఫైల్ చేసిన తెలంగాణ రాష్ట్ర దేవాలయాల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నాగిల్ల శ్రీనివాస్





**సికింద్రాబాద్ (ప్రశ్న న్యూస్)** సికింద్రాబాద్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయం వ్యవహారం రాజకీయ,పరిపాలనా వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. హైకోర్టు స్టేటస్‌కో అమల్లో ఉండగానే దేవాలయ పనులు పూర్తి చేసి కోర్టు ఆదేశాలను లెక్కచేయకుండా నిర్మాణం చేసి ప్రారంభించారు. ఈ వ్యవహారం వెనుక నిధుల కోసమే తొందరపాటు నిర్ణయాలు తీసుకున్నారని ప్రజలు విశ్వసిస్తున్నారు.

### హైకోర్టులో స్టేటస్‌కో ఉన్న పనులు చేసి ప్రారంభమా.?

స్థానికుల ఆరోపణల ప్రకారం, దేవాలయానికి సంబంధించిన వివాదంపై హైకోర్టు స్టేటస్‌కో అమలులో ఉంది. అయినప్పటికీ, ఎండోమెంట్ మరియు సెల్ఫ్ స్టైల్ కమిటీ సభ్యులు కోర్టు ఆదేశాలను పట్టించుకోకుండా కూల్చివేతలు చేపట్టి తిరిగి నిర్మాణ పనులు ప్రారంభించారని ప్రజలు విశ్వసిస్తున్నారు. ఇది న్యాయవ్యవస్థను అవమానించినట్టేనని వారు మండిపడ్డారు. సాక్షాత్ హైకోర్టు ఆదేశాలను కూడా ఇల్లీగల్ కమిటీలు ఎండోమెంట్ అధికారులు లెక్కచేయకుండా నిర్మాణం పూర్తి చేసి ప్రారంభించి హైకోర్టునే అవమానించారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### డబ్బుల కోసమే ఇల్లీగల్ కమిటీలు..

ఒక్క దేవాలయానికి మూడు కమిటీలు ఉండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది ఈ ఇల్లీగల్ కమిటీల వెనక కేవలం డబ్బుల దందానే ఉందని తీవ్ర ఆరోపణ వెల్లువెత్తుతున్నాయి.దేవాలయం పునర్నిర్మాణం పేరుతో అక్రమ కమిటీలు ఏర్పాటు చేసి నిధుల సేకరణ లక్ష్యంగా పనులు సాగిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అదేవిధంగా చాలా పురాతన దేవాలయం కావడంతో ఇందులో గుప్త నిధులు ఉన్నాయని అందుకోసమే పోలీసు, రెవెన్యూ, ఎండోమెంట్ శాఖ అధికారుల అనుమతులు లేకుండా కూల్చివేతలు, నిర్మాణం చేశారని ఆరోపించారు. అనుమతులు లేకుండా"అనుమతులు లేకుండా దేవాలయం కూల్చి మళ్లీ నిర్మించడం వెనుక భారీ నిధులే ప్రధాన కారణం" అని ప్రజలు భావిస్తున్నారు. హైకోర్టు స్టే ఉన్న విషయం తెలిసినా కావాలనే కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ప్రారంభోత్సవానికి పిలిచి న్యాయస్థానం ఆదేశాల కూడా పట్టించుకోడు అని చెప్పి ప్రజల కు చూపిస్తున్నారు.ఈ మొత్తం వ్యవహారం వెనుక స్థానిక మాజీ కార్పొరేటర్ హస్తం ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కేంద్ర మంత్రికి కోర్టు వివాదం సమాచారం ఇవ్వకుండా ఆయనని కోర్టు ముందు దోషిగా నిలబెట్టడానికి తీసుకువచ్చారని కొంతమంది బిజెపి అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

### అధికారుల మౌనం ప్రశ్నార్థకం..

ఈ వివాదంపై సంబంధిత శాఖలు ఇప్పటివరకు స్పందించకపోవడం గమనార్హం.స్టేటస్‌కో అమల్లో ఉండగా పనులు ఎలా జరిగాయి.?
అనుమతులు తీసుకున్నారా.? ఎన్ని అక్రమ కమిటీలు ఉన్నాయి.? ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ కృష్ణ ఎందుకు మౌనంగా ఉన్నారు.?హైకోర్టు ఆదేశాలు ఉన్న నిర్మాణ పనులు జరుగుతుంటే ఎండోమెంట్ కమిషనర్ ఎందుకు చర్యలు తీసుకోలేదు.?ఇల్లీగల్ కమిటీలతో అంతర్గత ఒప్పందాలు చేసుకొని అసిస్టెంట్ కమిషనర్ కృష్ణ మౌనంగా ఉన్నారా.?కోర్టు ఆదేశాలను కూడా అసిస్టెంట్ కమిషనర్ కృష్ణ అమలుపరచుకుంటే రేపు కోర్టులో ఏం సమాధానం చెబుతారు.?అనే ప్రశ్నలకు స్పష్టత రావాల్సి ఉంది.


### పూర్తి స్థాయి విచారణకు డిమాండ్

ఈ వ్యవహారంపై సిబిసిఐడి విచారణ జరిపి నిజానిజాలు వెలికితీయాలని భక్తులు డిమాండ్ చేస్తున్నారు. అత్యున్నత న్యాయస్థానం అయిన హై కోర్టు ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. తెలంగాణ రాష్ట్ర దేవాలయాల పరిరక్షణ సమితి అధ్యక్షుడు నాగిల్ల శ్రీనివాస్ హైకోర్టులో కంటెంట్కం పిటిషన్ ఫైల్ చేసినట్టు సమాచారం.హైకోర్టు ఆదేశాలు బేఖాతర్ పై కోర్టు సీరియస్ అయితే అధికారులు, ఈ మూడు ఇల్లీగల్ సెల్ఫ్ స్టైల్ కమిటీ మెంబర్ల పరిస్థితి ఏమిటి.?(సికింద్రాబాద్ లో కన్యకా పరమేశ్వరి దేవాలయం చుట్టూ నెలకొన్న ఈ వివాదం రాజకీయంగా మరింత వేడెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. హైకోర్టు ఆదేశాల ఉల్లంఘన జరిగింది అన్నదానిపై ఎండోమెంట్ అధికారుల స్పష్టమైన వివరణ ఇస్తే హైకోర్టు తీసుకునే కఠిన నిర్ణయాలపై ఎంతమంది అధికారులు, ప్రజా ప్రతినిధులు దోషులుగా కోర్టు శిక్షలకు గురవుతారో వేచి చూడాలి.

# మున్సిపల్ కార్యాలయం సమస్యల నిలయం

## చెత్తకుప్పలా మారిన సర్కిల్ కార్యాలయం

- ప్రజలకు నరకయాతన పట్టింపు లేని డీసీ లు
- మెట్ల పైనుండి జారి పడుతున్న ప్రజలు
- మున్సిపల్ కార్యాలయంలోని సమస్యను తీర్చలేని అధికారులు,ప్రజల సమస్యలు తీర్చగలరా.?
- డిప్యూటీ కమిషనర్ల కనుసైగల్లో సర్కిల్ పరిధిలో అవినీతి అక్రమాలు రాజమేలుతున్నాయా.?







ముషీరాబాద్(ప్రశ్న న్యూస్) ప్రజలకు సేవలందించాల్సిన ప్రభుత్వ కార్యాలయమే సమస్యల నిలయంగా మారితే పరిస్థితి ఎలా ఉంటుందో చెప్పడానికి జిహెచ్ఎంసి పరిధిలోని ముషీరాబాద్-- కవాడిగూడ మున్సిపల్ కార్యాలయం ప్రత్యక్ష ఉదాహరణగా నిలుస్తోంది. కార్యాలయం లోపల మాఫింగ్ చేయక దుమ్ముతో నిండిపోయింది. అక్కడక్కడ చెత్త ఉండి చెత్తకుప్పలను తలపిస్తుండగా, లోపల అస్వచ్ఛత పరాకాష్టకు చేరింది. అయిన డిప్యూటీ కమిషనర్లు, జోనల్ కమిషనర్ పట్టించుకోకపోవడంపై స్థానికులు అగ్రహారం వ్యక్తం చేస్తున్నారు.

### కూర్చోవడానికి కుర్చీలు ఏర్పాటు చేయరా.?

ముషీరాబాద్, కావాడిగూడ సర్కిల్
కార్యాలయానికి వచ్చిన ప్రజలు కూర్చోవడానికి కుర్చీలు లేవు. తాగునీటి సదుపాయం లేక వృద్ధులు, మహిళలు, కార్యాలయ సిబ్బంది సైతం తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సర్టిఫికెట్లు, పన్నుల చెల్లింపులు, ఫిర్యాదుల కోసం రోజూ వందలాది మంది వచ్చే ఈ కార్యాలయంలో కనీస సౌకర్యాలు లేకపోవడం ప్రజలను కష్టాలకు గురిచేస్తోంది. కార్యాలయంలోనే సమస్యలు తీర్చలేని అధికారులు సర్కిల్ పరిధిలో ప్రజల సమస్యలను ఎలా తీరుస్తారు అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

### పనిచేయని లిఫ్ట్ వృద్ధులకు నరకయాతన..

జిహెచ్ఎంసి పునర్విభజన లో భాగంగా ముషీరాబాద్, కవాడిగూడ ఏర్పాటు చేసిన తర్వాత దోమలగూడలో కార్యాలయం కేటాయించారు. ఈ కార్యాలయంలో ఉన్న లిఫ్ట్ నెలలుగా పనిచేయడం లేదని సిబ్బంది, ప్రజలు ఆరోపిస్తున్నారు. పై అంతస్తులకు వెళ్లాల్సిన వృద్ధులు, వికలాంగులు, సిబ్బంది మెట్లు ఎక్కే సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అయినా ఇప్పటివరకు లిఫ్ట్ మరమ్మత్తులు చేయాలన్న కనీస అవగాహన అధికారులకు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు అధికారులు ఇంత బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం చూస్తుంటే ప్రజల సమస్యలను అసలు తీరుస్తారా అంటూ ప్రశ్నిస్తున్నారు. భవన నిర్మాణ సమయంలో మెట్లు సరిగ్గా ఏర్పాటు చేయకపోవడంతో పాటు ప్రతిరోజు శుభ్రం చేయకపోవడంతో చాలామంది జారి పడుతున్నారు. ఈ మెట్ల పై నడిస్తే ప్రమాదం ఎప్పుడూ పొంచి ఉంది అన్నట్లుగా మారింది పరిస్థితి, మెట్లపై ఉండి చాలామంది జారిపడుతున్నారని వాటికి మరమ్మత్తులు చేయడంతో పాటు జారకుండా తగిన జాగ్రత్తలు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికే పలువురు జారి గాయపడ్డారనే సమాచారం ఉన్న అధికారులు స్పందించకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది.



### అధికారులు మౌనం ఎందుకు.?

ముషీరాబాద్, కావాడిగూడ డిప్యూటీ కమిషనర్లు ప్రజల సమస్యలు తీర్చరు, అవినీతి అక్రమాలపై అసలే స్పందించరు, కనీసం వాళ్ళ కార్యాలయంలో ఉన్న సమస్యలు కూడా తీర్చలేని దుస్థితిలో విధులు నిర్వహిస్తున్నారని ప్రజలు మండిపడుతున్నారు. దీనికి తోడు కిందిస్థాయి అధికారులు సైతం కార్యాలయ అత్వన్న పరిస్థితిని పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ప్రజల పన్నుల డబ్బులతో నడుస్తున్న కార్యాలయంలో కనీస శుభ్రత, సమస్యలు తీర్చడం, సౌకర్యాలు కల్పించకపోవడం ఇద్దరు డిప్యూటీ కమిషనర్ల నిర్లక్ష్యానికి నిదర్శనమని అంటున్నారు.

### ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణ అధికారులకే భారమవుతుందా.?

మున్సిపల్ కార్యాలయంలోనే చెత్త ఎత్త కుంటే ప్రజలకు సేవలు ఎలా అందిస్తారు.?
తాగునీరు, కుర్చీలు లేని పరిస్థితి ఎందుకు.?
పనిచేయని లిఫ్ట్ ఎప్పుడు మరమ్మతు చేస్తారు.?
ప్రమాదకర మెట్లపై జారిపడి ఆసుపత్రి పాలైతే బాధ్యత ఎవరిది.? ఫిర్యాదులు చేసిన పత్రికలలో కథనాలు వచ్చిన నిమ్మకు నిరత్తినట్లు ఉండడం సమాధానమా.?
సర్కిల్ సమస్యలపై జోనల్ కమిషనర్ కూడా మానవ వహించడం బాధ్యతారాహిత్యం కాదా.?
ఉన్నత అధికారులే డ్యూటీ సక్రమంగా చేయకుంటే ప్రజల సమస్యలు ఎలా తీరుతాయి.?
ప్రజలకు సేవలందించాల్సిన మున్సిపల్ కార్యాలయం సమస్యల కేంద్రంగా మారడం ఆందోళనకరం. వెంటనే జిహెచ్ఎంసి కమిషనర్, ఉన్నతాధికారులు స్పందించి శుభ్రత, తాగునీరు, కుర్చీలు, మెట్లు, లిఫ్ట్ మరమ్మతులు వంటి కనీస సదుపాయాలు కల్పించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.
ప్రజల కోసం ఉన్న కార్యాలయం ప్రజలకు భారంగా మారకూడదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఉన్నత అధికారులు తక్షణ చర్యలు తీసుకుంటారా.? లేక ఇదే పరిస్థితి కొనసాగుతుందా.? అనేది వేచిచూడాల్సిందే.

## ఖమేనీ హత్య.. కన్నీరు మున్నీరైన హైదరాబాద్ పాతబస్తీ

- నల్ల దుస్తులు ధరించి రోడ్డెక్కిన షియా ముస్లింలు



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మరణించడంపై హైదరాబాద్‌లో తీవ్ర నిరసనలు వ్యక్తమయ్యాయి. ఆదివారం పాతబస్తీలోని షియా ముస్లింలు పెద్ద ఎత్తున రోడ్లపైకి వచ్చి ఆందోళన చేపట్టారు. ఖమేనీ మరణవార్త ధృవీకరణ కావడంతో పాతబస్తీలోని షియా ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి. పురానీ హవేలీ, నూర్ ఖాన్ బజార్, దారుల్షా తదితర ప్రాంతాల్లో నల్ల దుస్తులు ధరించి, చేతిలో ఖమేనీ ఫొటోలు పట్టుకుని ర్యాలీలు నిర్వహించారు. తంజీమ్-ఎ-జాఫరీ సంస్థ పిలుపు మేరకు పురానీ హవేలీలోని మజార్-ఎ-ఇబ్నే-ఖతూన్ నుంచి భారీ ర్యాలీ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ర్యాలీలో పాల్గొన్న పలువురు కంటతడి పెడుతూ నినాదాలు చేశారు. అణచివేతకు వ్యతిరేకంగా పోరాడినందుకే ఖమేనీని పొట్టనబెట్టుకున్నారని, అగ్రరాజ్యాలకు తలొగ్గని నేతగా ఆయన నిలిచారని షియా మత పెద్దలు కొనియాడారు. ముస్లింల మధ్య ఐక్యత లేకపోవడమే ఈ విషాదానికి దారితీసిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ఖమేనీ మృతికి సంతాప సూచకంగా హైదరాబాద్‌లోని ఇరాన్ కాన్సులేట్ కార్యాలయం వద్ద ఆ దేశ జాతీయ జెండాను అవనతం చేశారు. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు పాతబస్తీలో ముందు జాగ్రత్తగా భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా, శనివారం ఉదయం టెహ్రాన్‌లో తన నివాసంలోని కార్యాలయంలో ఉండగా అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 86 ఏళ్ల ఖమేనీతో పాటు ఆయన కుమార్తె, అల్లుడు, మనవడు కూడా మృతి చెందారని ఇరాన్ మీడియా వెల్లడించింది.

## పశ్చిమ ఆసియాలో యుద్ధ మేఘాలు


- ఇండిగో 350 సర్వీసులు రద్దు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) పశ్చిమ ఆసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు అంతర్జాతీయ విమానయాన రంగాన్ని కుదిపేస్తున్నాయి. అమెరికా, ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య పెరుగుతున్న సైనిక ఘర్షణల కారణంగా పశ్చిమ ఆసియా గగనతలాన్ని మూసివేయడంతో ప్రపంచవ్యాప్తంగా విమాన రాకపోకలు స్తంభించాయి. ఆదివారం నాటికి భద్రతా కారణాల దృష్ట్యా సుమారు 700కు పైగా విమాన సర్వీసులు రద్దయినట్లు విమానయాన వర్గాలు అంచనా వేస్తున్నాయి. మరికొన్ని విమానాలను సురక్షిత ప్రాంతాల మీదుగా దారి మళ్లించారు. అంతర్జాతీయ విమానయానానికి కీలకమైన పశ్చిమ ఆసియా గగనతలంపై ఆంక్షలు విధించడంతో ఆసియా, యూరప్, ఉత్తర అమెరికా మధ్య నడిచే విమానాలపై తీవ్ర ప్రభావం పడింది. దుబాయ్, అబుదాబి, దోహా వంటి ప్రధాన గల్ఫ్ హబ్‌లలో విమాన సర్వీసుల షెడ్యూళ్లు తారుమారయ్యాయి. ఇరాన్, ఇజ్రాయెల్ గగనతలంపై ఆంక్షలు ఉండటంతో విమానయాన సంస్థలు ప్రత్యామ్నాయ మార్గాలను వెతుక్కుంటున్నాయి.ముఖ్యంగా గల్ఫ్ దేశాల మీదుగా రాకపోకలు సాగించే భారతీయ విమానయాన సంస్థలపై ఈ ప్రభావం ఎక్కువగా ఉంది. ప్రముఖ సంస్థ ఇండిగో రానున్న మూడు రోజుల వ్యవధిలో ఏకంగా 350కి పైగా విమానాలను రద్దు చేసింది. మార్చి 1న 166, మార్చి 2న 162, మార్చి 3న 43 విమానాలను రద్దు చేసినట్లు సమాచారం. ఇది ఆ సంస్థ సాధారణ ఆపరేషన్లలో సుమారు 7 నుంచి 8 శాతంగా ఉంది. ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ కూడా భద్రతా సూచనల మేరకు పలు సర్వీసులను రద్దు లేదా దారి మళ్లించాయి. ప్రపంచవ్యాప్తంగా ఎమిరేట్స్, లుఫ్తాన్సా వంటి దిగ్గజ సంస్థలు కూడా తమ షెడ్యూళ్లను మార్చుకున్నాయి. యుద్ధ ప్రభావిత ప్రాంతాలను తప్పించి, సుదీర్ఘమైన రూట్లలో విమానాలను నడుపుతుండటంతో ప్రయాణ సమయంతో పాటు ఇంధన వినియోగం భారీగా పెరిగింది. ఇది ఇప్పటికే ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న విమానయాన రంగానికి అదనపు భారంగా మారింది. పరిస్థితి సద్దుమణిగితే తప్ప విమాన సర్వీసులు సాధారణ స్థితికి వచ్చే అవకాశం లేదని నిపుణులు అంటున్నారు.

## ఖమేనీ హత్య కిరాతకమైన చర్య

- ఈ ఘటనను సినికల్ మర్డర్ గా అభివర్ణించిన పుతిన్



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ మరణంపై రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తీవ్రంగా స్పందించారు. అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో ఖమేనీ ప్రాణాలు కోల్పోవడం పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. దీన్ని 'సినికల్ మర్డర్' (కిరాతక హత్య)గా అభివర్ణించిన పుతిన్ ఇది అంతర్జాతీయ చట్టాలను, మానవత్వాన్ని పూర్తిగా ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. ఈ మేరకు ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్‌కు పుతిన్ ఓ లేఖ రాశారు. ఖమేనీని రష్యాలో అత్యుత్తమ రాజనీతిజ్ఞుడిగా గుర్తుంచుకుంటామని, ఇరు దేశాల సంబంధాల బలోపేతానికి ఆయన ఎంతో కృషి చేశారని ఆ లేఖలో కొనియాడారు. శనివారం జరిగిన ఈ దాడుల్లో ఖమేనీతో పాటు ఆయన కుటుంబ సభ్యులు, పలువురు సీనియర్ సైనిక అధికారులు మరణించినట్లు ఇరాన్ మీడియా ధృవీకరించింది. ఈ ఘటనతో ఇరాన్ 40 రోజుల పాటు సంతాప దినాలను ప్రకటించింది. తమ నాయకుడి మరణానికి ప్రతీకారం తీర్చుకోవడం తమ చట్టబద్ధమైన హక్కు, బాధ్యత అని ఇరాన్ స్పష్టం చేసింది. మరోవైపు ఇజ్రాయెల్ దాడులు కొనసాగిస్తుండటంతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ అధినేతలు స్పందిస్తూ అమెరికా-ఇరాన్ మధ్య చర్చలు జరగాలని సూచించారు. ఖమేనీ మరణం ప్రపంచ రాజకీయాల్లో, ముఖ్యంగా రష్యా-ఇరాన్ సంబంధాల్లో కీలక మార్పులకు కారణం కావచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588